ప్రజాశక్తి
ఆదివారం 13 ఆగస్టు 2023 8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా







విజయవాడ ధర్నాలో పాల్గొన్న ఉపాధ్యాయులు; మాట్లాడుతున్న ఎస్‌పి.మనోహర్ (అంతర్‌చిత్రం)

ఉద్యమం ఉధృతం

ధర్నాల్లో ఫ్యాప్టో నేతల హెచ్చరిక

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్, కలెక్టరేట్ (కృష్ణా) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని విడనాడాలని, తమ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. 117 జిఒ రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని, రాష్ట్ర విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తన వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేస్తూ ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం విజయవాడ, మచిలీపట్నంలలో ఉపాధ్యాయులు ధర్నాలు నిర్వహించారు. విజయవాడ అలంకార్ సెంటరులోని ధర్నా చౌక్, మచిలీపట్నంలోని కలెక్టరేట్ ధర్నా చౌక్‌లలో 12 గంటలపాటు ఆందోళనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వారంలోగా సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చిన సిఎం జగన్ మాట తప్పి జిపిఎస్ విధానాన్ని తీసుకురావడం సరికాదన్నారు. 1982లో పెన్షన్ ఉద్యోగి హక్కని సుప్రీంకోర్టు తీర్పు చెప్పినా పట్టించుకోవడంలేదన్నారు. పాఠశాలల విలీనం, తెలుగు మాధ్యమం రద్దు తదితర సంస్కరణలు చేపట్టి పాఠశాల విద్యా వ్యవస్థను ప్రభుత్వం ధ్వంసం చేసిందని విమర్శించారు. జూన్ 12 నాటికి బదిలీలు, జూన్ 25 నాటికి వివిధ క్యాడర్ల ప్రమోషన్ల ప్రక్రియ పూర్తయినా, క్యాడర్ స్ట్రెంత్ అప్డేట్ చేస్తున్నామనే పేరుతో ఇంతవరకు జీతాలు చెల్లించకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. జిఒ నెంబరు 117 వల్ల భవిష్యత్తులో ప్రాథమిక పాఠశాలలు,

(మిగతా 6లో)



మచిలీపట్నం ధర్నాలో పాల్గొన్న ఉపాధ్యాయులు, నేతలు

భూ రీ సర్వే పూర్తయ్యేనా ?

ఇంకా నాలుగు నెలలే గడువు

కృష్ణాజిల్లాలో మొత్తం గ్రామాలు 502

మొదటి దశలో పూర్తయినవి 100

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

'భూముల రీ సర్వేకు ప్రత్యేకంగా సర్వేయర్లను నియమించాం. డ్రోన్లు, రోవర్లు తదితర ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తున్నాం. 2023 చివరి నాటికి సమగ్ర భూ సర్వే పూర్తి చేస్తాం. అర్హులందరికీ యాజమాన్య హక్కుపత్రాలు ఇస్తాం"...అని గత ఏడాది అక్టోబర్ 20న అవనిగడ్డలో జరిగిన సభలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. అయితే ఆ మాటలు ఆచరణకు నోచుకునే పరిస్థితి కనిపించడం లేదు. కృష్ణాజిల్లాలో సర్వే జరగాల్సిన గ్రామాలు, మొదటి, రెండో దశ సర్వే నిర్వహిస్తున్న గ్రామాల సంఖ్యను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది.

జిల్లాలో మొత్తం 502 రెవెన్యూ గ్రామాల్లో మొదటి దశలో 100 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశారు. భూముల్లో సరిహద్దు రాళ్లు పాతారు. రెండో దశలో మరో 62 గ్రామాల్లో ఈ నెలాఖరుకు రీ సర్వే పూర్తి చేయడానికి జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. తాజాగా 37 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి 13 నోటిఫికేషన్ విడుదల చేశారు. నూతనంగా ఈ నోటిఫికేషన్ ఇచ్చిన 20 గ్రామాల్లో భూములపై హద్దు రాళ్లు పాతారు. మరో 25 గ్రామాల్లో ప్రక్రియ కొనసాగుతోంది. ఆగస్టు నెలాఖరుకు 162 గ్రామాల్లో రీ సర్వే పూర్తవుతుంది. అంటే పూర్తయిన గ్రామాలకన్నా సర్వే నిర్వహించాల్సిన గ్రామాల సంఖ్యే ఎక్కువగా ఉంది.

రీ సర్వే నిర్వహించాల్సిన గ్రామాలు 340

రీ సర్వేలో తొలుత డ్రోన్ ఫ్లయింగ్ నిర్వహిస్తారు. డ్రోన్ ద్వారా తీసిన చిత్రాలను ఆర్థోరెక్టిపై ఇమేజ్ (ఒఆర్ఐ)లను రూపొందించాలి. అనంతరం గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వాలిడిటీలను



నిర్ధారిస్తారు. అన్ని దశలు పూర్తయ్యాక 13 నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అభ్యంతరాల పరిష్కారానికి డిప్యూటీ తహశీల్దార్ల నేతృత్వంలో మొబైల్ కోర్టులను ఏర్పాటు చేశారు. అన్ని ప్రక్రియలు పూర్తయ్యాక సర్వే నంబర్ల స్థానంలో లాండ్ పార్శిల్ సంఖ్యలు కేటాయిస్తున్నారు. జిల్లాలో 502 గ్రామాల్లో డ్రోన్ ఫ్లయింగ్ పూర్తయింది. ఈ నెలాఖరుకు 162 గ్రామాల్లో సర్వే పూర్తవుతుంది. మరో 340 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించాల్సి ఉంది.

32 నెలల్లో మూడో వంతు గ్రామాల్లోనే..

ఉమ్మడి కృష్ణాజిల్లా జగ్గయ్యపేట మండలం తక్కెళ్ళపాడు గ్రామంలో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకాన్ని 2020 డిసెంబర్ 20న ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి ప్రారంభించారు. రీ సర్వేతో భూ వివాదాలు పరిష్కారం అవుతాయని చెప్పారు. ఆయన చెప్పినట్లు ఈ ఏడాది డిసెంబర్ నాటికి రీ సర్వే పూర్తి చేయాల్సి ఉంది. అయితే సర్వే మొదలై 32 నెలలు పూర్తయినా ఇప్పటి వరకు కృష్ణాజిల్లాలో మూడో వంతు గ్రామాల్లో మాత్రమే సర్వే నిర్వహించారు. మొదటి దశలో రీ సర్వేలో లోపాలపై పలు గ్రామాల్లో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. రెండో దశ రీ సర్వేలోనూ సమస్యలు పరిష్కరించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రీ సర్వే సకాలంలో పూర్తయ్యే పరిస్థితి కనిపిచండంలేదు.

దెబ్బతిన్న రోడ్లు, పైపులైన్ల పనులు చేపట్టండి : మంత్రి తానేటి

వార్త 6లో



3 కె రన్ నిర్వహిస్తున్న క్రీడాకారులు; రన్‌లో గోపీనాథ్ రెడ్డి, గోకరాజు గంగరాజు (అంతర్‌చిత్రంలో)

'మన ఆంధ్ర...మన ఎపిఎల్' 3కె రన్

తరలి వచ్చిన క్రికెట్ క్రీడాకారులు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : "మన ఆంధ్ర...మన ఎపిఎల్" పేరుతో శనివారం విజయవాడలో 3 కె రన్ నిర్వహించారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథ్ రెడ్డి బందర్ రోడ్డులోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద జ్యోతిని వెలిగించి జాతీయ జెండాను ఊపి ఈ రన్‌ను ప్రారంభించారు. అనంతరం భారత్‌కు రాష్ట్రం నుంచి అండర్-19 జట్టుకు ఆడిన మహిళా క్రికెటర్ ఎండీ షబనం, అపెక్స్ కౌన్సిల్ సభ్యులు ఎన్.గీతకు జ్యోతిని అందచేశారు. స్టేడియం నుంచి ప్రారంభమైన 3 కే రన్ టిక్కిల్ రోడ్డు మీదుగా సిద్ధార్థ కాలేజీ సర్కిల్ నుంచి తిరిగి స్టేడియం వద్దకు చేరుకుంది. అనంతరం జ్యోతిని ఎసిఎ రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్ రెడ్డికి అందచేశారు. ఈ సందర్భంగా గోపీనాథ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రా నుంచి ఐపిఎల్‌కు క్రీడాకారులను తయారు చేయడమే తమ లక్ష్యమన్నారు. ఈనెల 16 నుంచి 27వ తేదీ వరకు విశాఖలోని డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఎపిఎల్-2 నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళగిరిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం పనులు పూర్తి చేయాలని సిఎం జగన్ ఆదేశాలిచ్చారని తెలిపారు. బిసిసిఐ ఉపాధ్యక్షులు గోకరాజు గంగరాజు మాట్లాడుతూ దేశంలో ఆంధ్ర క్రికెట్ సంఘానికి ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎసిఎ జాయింట్ సెక్రటరీ ఏ.రాకేశ్, ఎసిఎ అపెక్స్ కౌన్సిల్ సభ్యులు ఎన్.గీత, కె.వి.పురుషత్తం రావు, జితేంద్ర నాథ్ శర్మ, కెడిసిఎ అడహక్ కమిటీ చైర్మన్ టి.త్రినాథ్ రాజు, రాష్ట్ర మాజీ కార్యదర్శులు అరుణ్ కుమార్, దుర్గా ప్రసాద్, జిల్లా మాజీ కార్యదర్శి ఎల్లారావు, కన్వీనర్ ఎం.రవి శంకర్ పాల్గొన్నారు.

గన్నవరం గరం గరం

మరోసారి వేడెక్కుతున్న రాజకీయాలు

నేడు అనుచరులతో వైసిపి నేత యార్లగడ్డ భేటీ

టిడిపిలోకి వెళతారని జోరుగా ప్రచారం



ప్రజాశక్తి - గన్నవరం : గన్నవరం రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. గన్నవరం నియోజకవర్గం నుండి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన యార్లగడ్డ వెంకట్రావు తాజాగా తన అనుచరులతో ఆదివారం సమావేశం కానుండడం చర్చనీయాంశమైంది. ఈ సమావేశంలో ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారోనన్న ఉత్కంఠ నెలకొంది. గన్నవరం వైసిపి టికెట్ తనకు రాదనే అభిప్రాయానికి వచ్చిన ఆయన తన భవిష్యత్తుపై నిర్ణయం తీసుకోవచ్చని తెలిసింది. అయితే యార్లగడ్డ మాత్రం సిఎం జగన్ తనకు అన్యాయం చేయరని, తనకే అవకాశం కల్పిస్తారని చెబుతుండడం గమనార్హం. వైసిపి సీటు రాకపోతే టిడిపి నుంచి బరిలో దిగుతారని కొంతమంది రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. అయితే ఆయన అనుచరుల్లో కొందరు సీనియర్లు ఇండిపెండెంట్‌గా రంగంలోకి దిగితే గెలవచ్చని యార్లగడ్డకు సంకేతాలు ఇస్తున్నట్లు తెలిసింది. గత ఎన్నికల్లో యార్లగడ్డ వైసిపి అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. టిడిపి నుంచి గెలిచిన ఎంఎల్‌ఎ వంశీమోహన్ వైసిపికి అనుకూలంగా వ్యవహరిస్తుండడంతో రెండేళ్ల నుండి యార్లగడ్డ పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఈనేపథ్యంలో ఈసారి వైసిపి నుండి పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. వైసిపిలోనే మరో గ్రూపుగా ఉన్న యార్లగడ్డ వెంకట్రావు, దుట్టా రామచంద్రరావులకు చెక్ పెట్టేందుకు ఎంఎల్‌ఎ వంశీ ప్రయత్నిస్తున్నారు. వంశీకి వైసిపి అధిష్టానం అండదండలు కూడా ఉండడంతో నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను శరవేగంగా ముందుకు తీసుకువెళుతున్నారు. మరోవైపు ఎన్నికలు దగ్గర పడుతుండడంతో యార్లగడ్డ వెంకట్రావు రెండు నెలలుగా నియోజకవర్గంలో తిరుగుతూ పార్టీ కార్యకర్తలను కలుస్తూ హడావుడి చేస్తున్నారు. నియోజకవర్గం నుంచి మళ్లీ తానే పోటీ చేస్తానని యార్లగడ్డ చెబుతున్నారు. తాను వైసిపిలోనే ఉన్నానని, జగన్‌ను నమ్ముకుని రాజకీయాల్లోకి వచ్చానని, ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నిర్ణయంపై తన రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని అంటున్నారు. అమెరికా నుండి వచ్చిన తనను సిఎం జగన్ 'క్రాస్‌రోడ్స్'లో వదిలి వేయరన్న నమ్మకాన్ని, విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయితే వైసిపి సీటు రాకపోతే యార్లగడ్డ టిడిపి నుంచి ఎన్నికల బరిలో ఉంటారని సోషల్ మీడియాలో పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆయన ఈనెల 13న గన్నవరంలోని ఎస్ఎం కళ్యాణమండపంలో తన అనుచరులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నారని చెబుతున్నారు. యార్లగడ్డ టిడిపిలోకి వెళితే గన్నవరం రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటాయని అంటున్నారు.

చందాపురంలో ఓటర్ల సర్వే


చందాపురంలో ఓట్లు సర్వే చేస్తున్న దశ్యం

ప్రజాశక్తి- నందిగామ : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాస్ నాని, ఆదేశాల మేరకు నందిగామ నియోజక వర్గం పోలింగ్ బూత్ నెంబర్ 69లో ఓటర్ లిస్టు వెరిఫికేషన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. చందాపురం గ్రామంలో కొత్త ఓటర్ల నమోదు 15, డెత్‌లు 6, ఓటర్ లిస్ట్‌లో గల ఫొటోలు, పేర్లు, డోర్ నెంబర్లు సరి చేసుకోవాలని బిఎల్‌ఒలు సూచించారు. చందాపురం గ్రామ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్, బిఎల్‌ఒ త్రినాథ్‌తో ప్రజలకు సలహాలు సూచనలు అందజేశారు. చందాపురం గ్రామం బూత్ కన్వీనర్, ఎన్టీఆర్ జిల్లా డెవలప్మెంట్ కోఆర్డినేషన్, మానిటరింగ్ కమిటీ సభ్యులు హైకోర్టు న్యాయవాది ఎక్కిరాల హనుమంతరావు పలువురు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మునగాలపల్లిలో 'నా మట్టి - నా దేశం'


జాదీకా అమత్ మహొత్సవం దృశ్యం

ప్రజాశక్తి - నందిగామ : ఆజాది కా అమత మహొత్సవ్ - 2023 ముగింపు ఉత్సవాలలో భాగంగా మునగాల పల్లి గ్రామంలో సర్పంచ్ గంగూరు వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో 'నా మట్టి - నా దేశం " కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శిలాఫలకం ప్రారంభించి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. వీరులకు వందనం, రిటైర్డ్ ఆర్మీ అధికారుల సేవలను కొనియాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అనేక మంది అమరవీరుల త్యాగాలను ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా గుర్తించినట్లవుతుందని సర్పంచ్ అన్నారు. అనంతరం 'పంచ ప్రాణ ప్రతిజ్ఞ 'చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఎంపిటిసి మేడేపల్లి ముత్తమ్మ, నల్లాని శ్రీనివాసరావు, ఉపాధి హామీ పథకం, ఎపిఒ.వెంకటేశ్వరరావు, సెక్రటరీ శైలజా కుమారి మరియు సచివాలయ అధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు.

2కె రన్‌కు సిద్ధం


నూతన వస్త్రాలను పంపిణీ చేస్తున్న పోతిన వరప్రకాష్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : భవానీపురం శివాలయం నుండి ఆదివారం ఉదయం 6 గంటలకు ప్రారంభం కానున్న వెలంపల్లి విత్ టూకే రన్‌కు శ్రీనన్నదళం సర్వంసిద్ధమని శ్రీనన్నదళం రాష్ట్ర అధ్యక్షులు పోతిన వరప్రకాష్ ప్రకటించారు. శనివారం శ్రీనన్నదళం సభ్యులకు నూతన వస్త్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోతిన వరప్రకాష్ మాట్లాడుతూ శ్రీనన్నదళం ఆధ్వర్యంలో జరుగుతున్న వారోత్సవాలకు తోడుగా నగరవ్యాప్తంగా శ్రీనన్న పేరిట అనేక కార్యక్రమాలు నిర్వహించడాన్ని చూస్తూ ఉంటే 2024లో రానున్న ఎన్నికల్లో విజయభేరి మోగించి ఆనందోత్సవాల్లో జరుపుకున్న టువంటి ఆనందంగా ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరాబత్తుల రాంబాబు, శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం సహాయ కార్యదర్శి పొట్నూరి దుర్గాప్రసాద్, హైకోర్టు అడ్వకేట్ పిళ్ళా సుదర్శన్ తిలక్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గవర్నర్ పేట, బందర్ రోడ్, విజయవాడ నందు గల ఠాగూర్ స్మారక గ్రంథాలయం నందు ఉమ్మడి కష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ శ్రీమతి తిప్పరమల్లి జమలపూర్ణమ్మ గారి ఆధ్వర్యంలో గ్రంథాలయ అధికారిణి కె.రమాదేవి అధ్యక్షతన జాతీయ గ్రంథాలయ దినోత్సవం నిర్వహించటం జరిగినది. ఈ సందర్భంగా ఎస్. ఆర్. రంగనాథన్ గారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి మాట్లాడుతూ గ్రంథాలయ దినోత్సవం గురించి, భారతదేశ వ్యాప్తంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం ఆగస్టు 12 న ఎస్ అర్ రంగనాథన్ గారి పుట్టినరోజు సంధర్భంగా ఏటా నిర్వహిస్తారు అని పేర్కొన్నారు. పబ్లిక్ లైబ్రరీలతో పాటు, అకడమిక్ లైబ్రరీలు, గ్రంథాలయ వికాసానికి విశేషంగా కషి చేసిన ఆయన జన్మదినం ను జాతీయ గ్రంథాలయ దినోత్సవంగా

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలంలోని పల్లగిరి గ్రామానికి చెందిన షేక్ నజీరా(35) విజయవాడ నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో ముగ్గురు శిశువులకు జన్మనిచ్చి, ప్రసవం అనంతరం అనారోగ్యంతో ఆమె మృతి చెందడంతో వారి కుటుంబ విషాదంలో మునిగిపోయింది. నందిగామ శాసనసభ్యులు మొండితోక జగన్‌మోహన్‌రావు శనివారం వారి నివాసానికి వెళ్లి, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ముస్లిం చైతన్య వేదిక అధ్యక్షులు దుబాయ్ కరిముల్లా మతురాలు షేక్ నజీరా పిల్లల భవిష్యత్తును దష్టిలో ఉంచుకొని రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


బాధితునితో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

గిట్టుబాటు ధర కల్పనలో విఫలం

ప్రజాశక్తి తిరువూరు : రైతులు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని టిడిపి తిరువూరు నియోజవర్గ ఇన్‌ఛార్జ్ శవాల దేవదత్తు పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని అక్కపాలెం, వావిలాల, రాజుగూడెం గ్రామాల్లో అయన ఆ పార్టీ నాయకులతో కలిసి పంట పొలాలను, అధ్వానంగా ఉన్న రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో కలిసి మిరప మొక్కలను నాటారు. ఒక ఎకరాకు ఎంత ఖర్చవుతుందని రైతులను అడిగి తెలుసుకున్నారు. పత్తి మిరపకు సరైన గిట్టుబాటు ధర లేదని, వారికి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని దత్తు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పిస్తుందని రైతులకు వివరించారు. అక్కపాలెం నుండి తిరువూరు పట్టణానికి నిత్యం రాకపోకలు సాగించాలంటే రహదారి భయానకంగా ఉందని, వర్షం పడిందంటే రోడ్డు మీద గుంతలు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితని దత్తు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం చేపట్టి నాలుగున్నర సంవత్సరాలు పూర్తయినా కనీసం తిరువూరు నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న అక్కపాలెం రోడ్డుకి గుంతలు కూడా పూడ్చలేని నీకు ఎమ్మెల్యేగా కొనసాగే అర్హత లేదన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గద్దె వెంకన్న గండ ప్రసాద్, కొమ్మినేని శేషగిరిరావు, పిట్టా చైతన్య, కొమ్మినేని రాధాకష్ణ, స్టాలిన్, సురేష్, టి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు వ్యవహారం తెలుసు : రక్షణనిధి

ప్రజాశక్తి- తిరువూరు : నిన్నటి దాకా మంచి వాడినన్నారు. తిరువూరు నగరపంచాయతీ చైర్మన్ మార్పుపై తొలుత తీసుకున్న నిర్ణయం అమలుకు ప్రయత్నిస్తుంటే నాపై కరపత్రాలు పంచుతారు. ఈ వ్యవహారం ఎవరు నడిపిస్తున్నారో నాకు తెలుసు. పోలీసులు కూడా లోతుగా దర్యాప్తు చేసి త్వరలోనే నిందితుల్ని కటకటాల వెనక్కి పంపుతారు. మళ్లీ నాకే తిరువూరు నుండి పోటీ చేసి అవకాశం అధిష్టానం ఇచ్చేసింది. నేనే పోటీ చేస్తా, మీ అందరి ఆదరాభి మానాలతో అఖండ మెజారిటీతో గెలుస్తా. నన్ను ఆదరించి వెన్నంటి నడిచే వారికి న్యాయం చేస్తా. ప్రజాభిమానమే నాకు కొండంత అండ అన్నారు. తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలగడ్డ రక్షణనిధి. శనివారం ఆయన తిరువూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - మైలవరం : లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో శనివారం ఎస్వీఆర్ జిఎన్ఆర్ ఇంటర్, డిగ్రీ విద్యార్థిని విద్యార్థులకు స్థానిక ఎస్వీఎస్ కళ్యాణమండపంలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన 316డి లయన్స్ ఫాస్ట్ గవర్నర్ ఏ.కోటిరెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ అంతర్జాతీయ సేవా సంస్థని ఆ సంస్థ ద్వారా ప్రపంచవ్యాప్తంగా అనేక సేవలు అందిస్తున్నామన్నారు. విద్యార్థి దశలోనే ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు వెళ్లినట్లయితే విజయం సాధించగలుగుతారన్నారు. ప్రతి విద్యార్థిలో అమోఘమైన శక్తి సామర్థ్యాలు, ప్రజ్ఞా పాఠవాలు కలిగి ఉంటారని, వారిలో ఉన్న తెలివితేటలు ప్రణాళిక బద్ధంగా ఉపయోగించుకుంటే విజయాన్ని ఎవరు ఆపలేరని అన్నారు.

మణిపూర్ దురాగతాలపై దేశం సిగ్గుపడుతోంది

ప్రజాశక్తి - భవానీపురం : మహిళలకు రక్షణ లేని భారత దేశంలో ప్రధాని మోడీ జాతీయ జెండాలను ఎగుర వేసి ఉత్సవాలు జరపాలని ఆదేశించటం సమంజసం కాదని గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు గాంధీ నాగరాజన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మణిపూర్‌లో మహిళలపై జరిగిన దురాగతాలను నిరసిస్తూ శనివారం పశ్చిమ నియోజకవర్గంలోని ఊర్మిళానగర్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో హింసకు యావత్తు భారతదేశం సిగ్గుపడుతోందని అన్నారు. మణిపూర్‌లో హింసను ఆపలేకపోయినందుకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ, మణిపూర్ గవర్నర్, మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామాలు చేసి భారత ప్రజలను క్షమాపణలు కోరాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గాంధీదేశం ట్రస్ట్ మహిళాఅధ్యక్షురాలు ఆర్ఎన్. శివరంజని, ట్రస్ట్ ఏపీ అధ్యక్షురాలు బి.భారతి పాల్గొన్నారు.


చీరల కౌంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు

చీరల కౌంటర్ పరిశీలన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానంలో నిర్వహిస్తున్న చీరల కౌంటర్‌ను ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు శనివారం పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి సూచనలు చేశారు. రెండవ శనివారం సందర్బంగా అమ్మవారి దర్శనార్థం భక్తులు విశేషంగా తరలివచ్చారు. రద్దీ దష్ట్యా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు ఏర్పాట్లును పర్యవేక్షించారు.

గుడి ప్రతిష్ట సందర్భంగా అన్నదానం

ప్రజాశక్తి - విజయవాడ : కృష్ణలంక 22వ డివిజన్‌లోని అన్నమ్మతల్లిగుడి ప్రతిష్ట రోజు సందర్భాన్ని పురస్కరించుకొని పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ గుడి ప్రతిష్ట జరిగి శనివారం నాటికి 26 సంవత్సరాలయిన సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు విజ్జి సన్యాసిరావు, కార్యదర్శి పెద్ది అన్నారావు, కోశాధికారి బత్తుల రమణ, ఉపాధ్యక్షులు తాతా సాంబయ్య, నాయకులు బత్తుల నాగేశ్వరరావు నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. విజయవాడ నగర పాలక సంస్థలో ఆనాటి కమ్యూనిస్టుల పాలనలో డిప్యూటీ మేయర్‌గా వ్యవహరించిన వి ఉమామహేశ్వరరావు ఈ గుడి ప్రతిష్టకు ఆనాడు సహకరించినందున ఆ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ నేడు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, తూర్పు సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు బత్తుల చిన్నారావు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి కృష్ణ, ఇతర పార్టీలనేతలు తదితరులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో కృష్ణలంక ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఇంట్లో చోరీ

ప్రజాశక్తి వత్సవాయి: ఇంటి తాళం పగలగొట్టి రూ.20 వేలు దొంగిలించిన ఘటన మండలంలోని మక్కపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఆ గ్రామానికి చెందిన ఏలూరి శాంతలక్ష్మి రెండు రోజుల పాటు తాళం వేసి చుట్టాలింటికి వెళ్ళింది. ఉదయం ఇంటికి వచ్చిన శాంత లక్ష్మి బట్టలు చిందర వందరగా వందరగా పడి ఉండటంతో, బీరువా తెరిచి చూడగా అందులో ఉంచిన నగదు కనిపించలేదు. విషయం పోలీసులకు తెలియజేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సర్పంచ్ పదవికి 3 నామినేషన్లు

ప్రజాశక్తి వత్సవాయి, పెద మోదుగు పల్లి సర్పంచ్ పదవికి మూడు నామినేషన్లు, మండలంలోని పెద మోదుగుపల్లి సర్పంచి, సింగవరం ఆరో వార్డు సభ్యులు ఇటీవల అనారోగ్య కారణాలతో మతి చెందారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 19న ఎన్నికలు నిర్వహించనున్నారు. అయితే దానిలో భాగంగా పెద్ద మోదుగు పల్లి సర్పంచి పదవికి ముగ్గురు నామినేషన్లు వేయగా, సింగవరం ఆరవ వార్డు సభ్యులకు ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. సింగవరం ఆరో వార్డు ఏకగ్రీవం చేయటానికి సమీపంలో ఉన్న ప్రముఖ నాయకులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. సింగవరం గ్రామంలో మూడవ ఫైనల్ వేయటానికి ప్రయత్నం చేస్తే చిట్యాల గ్రామానికి చెందిన ప్రముఖ వ్యక్తి ప్రజల సమస్యలను ఆయన దష్టికి తీసుకెళ్లడంతో పరిష్కారం చేస్తానని హామీ ఇవ్వడంతో నామినేషన్ వేయకుండా ఆగిపోయారు. ఈ నెల 14న విత్‌డ్రాలు ఉండటంతో ఎవరు బరిలో ఉంటారు ఎవరు రాజీ పడతారు అనేది వేచి చూడాలి.

అన్నసమారాధన

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : కళ్ళే లలిత ట్రస్ట్ సేవలు కొనసాగిస్తామని ఆమె కుటుంబ సభ్యులు కళ్ళేనాగేశ్వరరావు, కళ్ళే సీతామాలక్ష్మి అన్నారు. స్వర్గీయ కళ్ళే లలిత అకాలమరణం కుటుంబ సభ్యులకు దూరమైనప్పటికీ, ఆమె జ్ఞాపకార్థం ప్రతినెల 12న పేదలకు అన్న సమారాధన కార్యక్రమం సింగ్‌నగర్‌లోని కళ్ళే వారి ఇంటి వద్ద ప్రతినెల అన్న సమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అజిత్ సింగ్‌నగర్ కళ్లే లలిత వీధి వద్ద శనివారం స్వర్గీయ కళ్ళే లలిత జ్ఞాపకార్థం పేదలకు అన్న సమారాధన, పండ్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కూతురు, అల్లుడు కళ్ళే సీతామాలక్ష్మి, ముప్పూరి హరీష్, మాజీ కార్పొరేటర్ చందన సురేష్, పాల్గొని పలువురు పేదలకు అన్న సమారాధన, పండ్లుపంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళ్ళే నాగేశ్వరరావు 16 నెలల నుండి పేదలకు అన్న సమారాధన నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో లాపాటి దుర్గారావు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం మృతికి సంతాపం

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు: గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పొడుగు రాంబాబు శనివారం ఉదయం బెంగుళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన పెనుగంచిప్రోలు కెవిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పూర్వ విద్యార్థి, అదే పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగా కూడా పనిచేశారు. ఆయన అధ్వర్యంలో నందిగామ డివిజన్ సబ్‌జోన్ ఆటల పోటీల నిర్వహణ ఘనంగా నిర్వహించారు. ఆయన మతి పట్ల వివిధ ఉపాధ్యాయ సంఘ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పూర్వవిద్యార్థులు సంతాపాన్ని తెలియజేశారు. ఆదివారం జగ్గయ్యపేట పట్టణంలో అంత్యక్రియలు నిర్వహించడం జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

అభివృద్ధిపై మాట్లాడకుండా నేతలపై విమర్శలు తగదు : టిడిపి



మాట్లాడుతున్న తెలుగు మహిళా అధ్యక్షురాలు స్వర్ణలత

ప్రజాశక్తి-చల్లపల్లి : మంత్రి రోజా ఇకపై జబర్దస్త్ షోలు బుక్ చేసుకుని షోలు చేసుకోవడమే తప్ప రాజకీయ భవిష్యత్తు ఉండదని తెలుగు మహిళా కష్ణాజిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత అన్నారు. మంత్రి రోజ అవనిగడ్డ నియోజకవర్గంలో ఏర్పాటుచేసిన నియోజకవర్గ సమీక్షా సమావేశంలో పాల్గొని అభివద్ధిపై మాట్లాడకుండా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ లపై విమర్శలు చేయడంపై స్పందించిన స్వర్ణలత మోపిదేవి మండలం వెంకటాపురం గ్రామంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గ సమీక్షా సమావేశానికి విచ్చేసినపుడు నియోజకవర్గానికి నాలుగున్నరేళ్లలో ఎన్ని నిధులు కేటాయించారో, ఏమి అభివద్ధి పనులు చేశారో మాట్లాడాలి తప్ప, ప్రతిపక్ష నాయకులపై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించు కోవాలన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో అవనిగడ్డ నియోజకవర్గాన్ని పర్యటకంగా అభివద్ధి చేయడానికి ఎన్నో పనులు చేసారని, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నాగాయలంక లో నిర్మాణంలో ఉన్న జలక్రీడల కేంద్రం పనులు నిలిచిపో యాయని, హంసలదీవి అభ్వివద్ధి ఆగిపోయిందని, ఇలా చెప్పుకుంటూ పోతే నియోజక వర్గంలో పర్యటకంగా అభివద్ధి ఎక్కడా జరగలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా జిల్లా కార్యదర్శి పైడిపాముల కష్ణకుమారి, మోపిదేవి మండల ఎంపీపీ రావి దుర్గావాణి, అవనిగడ్డ నియోజకవర్గ అధ్యక్షురాలు బండే కనకదుర్గ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దివి యుగందరి పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చంద్రబాబు బాటలు : టిడిపి

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్రంలో డ్వాక్రా సంఘాల వ్యవస్థను దేశంలోనే మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేసి వారి ఆర్థిక స్వాలంబనకు బాటలు వేసిన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు అని తెలుగు మహిళా అవనిగడ్డ నియోజకవర్గం అధ్యక్షురాలు పండే కనకదుర్గ కొనియాడారు. శనివారం పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా చంద్రబాబు నాయుడు పై అవాకులు చవాకులు పేలడంపై వారు తీవ్రంగా ఖండించారు. తెలుగుదేశం కాలంలో మహిళలకు చేసింది ఏమీ లేదని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. మహిళలకు డ్వాక్రా రుణమాఫీ పసుపు కుంకుమ వడ్డీ రాయితీల ద్వారా 21 వేల కోట్ల రూపాయల లబ్ధిని చంద్రబాబు నాయుడు చేకూర్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా అవనిగడ్డ మండల అధ్యక్షురాలు యాసం లంకమ్మ, కమ్మిలి అన్నపూర్ణమ్మ, మోపిదేవి మాజీ ఎంపీపీ మోర్ల జయలక్ష్మి, విశ్వనాథపల్లి పాప మట్ట నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు

ఇందుపల్లి బ్రాంచ్ కాల్వ కల్వర్టు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) : ఉంగుటూరు మండలం నందమురు గ్రామంలో గల గుడివాడ-కంకిపాడు రోడ్డు కి క్రాస్ అయి వెళ్లే ఇందుపల్లి బ్రాంచ్ ఛానల్ స్లాబ్ కల్వర్ట్ నిర్మాణ పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. ఈ కలవర్టు కూలిపోయినందున కాలువ హెడ్ తూముల నుండి నీరు సరియగు స్థాయిలో సరఫరా అవ్వకపోవటంతో ఆయకట్టు పరిధిలోని నందమురు, ఇందుపల్లి, వేమండ గ్రామ రైతులు తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను రైతాంగం స్థానిక శాసన సభ్యులు వంశీ దష్టి కి తీసుకువెళ్లగా దీనిపై వంశీ వెంటనే స్పందించి ఉంగుటూరు మండల పరిషత్ అభివద్ధి అధికారి జి.ఎస్.వి శేషగిరిరావును కూలిపోయిన కల్వర్డు పనులను యుద్ధప్రాతిపదికపై నిర్మాణం పనులు ప్రారభించాలని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు మండల పరిషత్ అధ్యక్షులు వి. సరోజినీ చొరవతో మండల పరిషత్ నిధులు నుండి 2 లక్షలు రూపాయలతో చేయడంతో మరమ్మతు పనులు చేపట్టారు. పంచాయతీ రాజ్ శాఖ , జలవనరుల శాఖ, ఆర్ అండ్ బిశాఖ, మరియు సదరు ఆయకట్టు రైతుల వారి సహకారంతో ఈ కల్వర్డు తూము పనులు వేగవంతంగా పూర్తి చేస్తామని ఎండిఒ తెలిపారు.



పనులు పరిశీలిస్తున్న దృశ్యం

రోడ్డుపై ప్రమాదకరంగా గుట్టలు



ప్రజాశక్తి ఘంటసాల : ఘంటసాల కొడాలి ఆర్అండ్ బి రహదారిపై ఘంటసాలపాలెం వద్ద కంకర గుట్టల కారణంగా ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపైకి వచ్చేలా మెటీరియల్ ను పోసి ఉంచటంతో వాహనాలు తప్పుకోవడానికి చాలా ఇబ్బందికరంగా ఉందని రాత్రులు అటు నుంచి ప్రయాణిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు. ఈ మెటీరియల్ ను గ్రామంలోని రహదారుల అభివద్ధి కోసం తీసుకొస్తే ఇన్ని రోజులు ఇలా రహదారిపై ఉంచటంతో ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు, విద్యార్థులు వాపోతున్నారు. రెండు వాహనాలు ప్రయాణించే ఖాళీ ఉండవలసిన చోట ఒక్క ఆటో మాత్రమే వెళ్లే పరిస్థితి ఉందని, రాత్రి వేళ ఎవరైనా ఆదమరిచి ప్రయాణం సాగిస్తే రాళ్ల మీద పడే ప్రమాదం ఉందని వాహనదారులు వాపోతున్నారు. తక్షణమే రహదారి మీదకు ఉన్న మెటీరియల్ ను తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

ప్రజాశక్తి- ఉయ్యూరు : అప్పుడే పుట్టిన వారినుండి 5 సంవత్సరాల లోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్ప నిసరిగా వేయించాలని మిషన్ ఇంద్రధనస్సు ప్రోగ్రాం జిల్లా అధికారి సుదర్శన్ బాబు అన్నారు. కలవపాముల హెల్త్ క్లినిక్ నందు జరుగుతున్న మిషన్ ఇంద్రధనస్సు ప్రోగ్రాంలో భాగంగా పిల్లలకు వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 5 సంవత్సరాల లోపు పిల్లలందరికి టీకాలు వేయించాల ని, గర్భిణీస్త్రీలు టీడీ ఇంజక్షన్లు, పౌష్టికాహారం, ఐరన్ మాత్రలు, కాల్షియం మాత్రలు తీసుకోవాలన్నారు. కాటూరు పీహెచ్సీ అధికారి జి.దీప, ఆరోగ్య విస్తరణ అధికారి నాగార్జున బాబూరావు, శిరీష, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - గుడివాడ : స్నేహితుడిని హత్య చేసిన సంఘటన గుడివాడ రూరల్ మండలం బొమ్ములూరు గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గుడివాడ రూరల్ మండలంలో బొమ్ములూరు గ్రామంలో నివాసం ఉంటున్న గుత్తా సురేష్ (38) అతని స్నేహితులు కలిసి గ్రామంలో మద్యం సేవిస్తుండగా సురేష్ కి అతని స్నేహితుడు చక్రికి మధ్య మాట మాట పెరిగి సురేష్ ని చక్రి మందు సీసా పగలగొట్టి గొంతులో పొడిచి హత్య చేశాడు. ఈ హఠాత్పరిణామంతో అక్కడ ఉన్న మిగిలిన మిత్రులు పారిపోగా సురేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ క్రమంలో గ్రామస్తులు గుడివాడ తాలూకా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు గ్రామానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.



విద్యార్థులు నైతిక విలువలను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ (గన్నవరం) : బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామంలో ఫాస్టర్ ఫిలిప్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు నైతిక విలువలు వ్యక్తిత్వ లక్షణాలు అంశం పై మార్గనిర్దేశం కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ ఎన్నారై విశ్వనాథపల్లి రాజేష్ మమతల పందిరి వ్యవస్థాపకులు లంక రమేష్ , విశ్వభారతీ స్కూల్ ప్రిన్సిపాల్ ఫిరోజ్ , వైష్ణవి ఫౌండేషన్ అధినేత పరుచూరి రామకష్ణ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కష్టంతో కాకుండా ఇష్టపడి చదివితే చదువుల్లో బాగా రాణించ గలరని మమత పందిరి వ్యవస్థాపకులు లంకరమేష్ అన్నారు. అధిక విలువలను కలిగి ఉండటం స్వీయ-ప్రేరణను కలిగిస్తుందని పరుచూరి రామకష్ణ అన్నారు. యువత చదువుతో పాటు దేశాన్ని నిర్ధేశించే రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు సేవా చేయాలని దిశానిర్దేశం చేశారు. ఉపాధ్యాయుడు సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు

శరవేగంగా రోడ్డు నిర్మాణం



ప్రజాశక్తి-పమిడిముక్కల : పమిడిముక్కల మండలంలోని వీరంకిలాకు నుండి కృష్ణాపురం వరకు రోడ్డు 8 కోట్ల రూపాయలతో నిర్మాణం జరుగుతోందని, త్వరలో పూర్తవు తుందని ఆర్అండ్బి ఎఈ షేక్ సమీర్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ పమిడి ముక్కల మండలంలోని మంటాడా-లంకపల్లి రోడ్, పేరెంట్ల నుండి కృష్ణాపురం వరకు తారు రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. పామర్రు ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్తో రోడ్డును త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.

సరసమైన ధరలకు మందులు సరఫరా



ప్రజాశక్తి-పమిడిముక్కల : వీరంకిలాకు, పరిసర ప్రాంతంలోని ప్రజలకు అందుబాటులో సరసమైన ధరలకు మందులు అందజేస్తున్నామని విజయ మెడికల్ షాప్ అధినేత నాగేంద్రరావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని వీరంకిలాకు, కపిలేశ్వరపురం, మేడూరు, పమిడముక్కల, కృష్ణాపురం గ్రామాల్లోని ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లకుండా మందులు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. గత 20 సంవత్స రాల నుంచి మెడికల్రంగంలో సేవలందిస్తున్నామన్నారు.

పోగొట్టుకున్న బంగారు గొలుసు అప్పగింత

ప్రజాశక్తి..హనుమాన్ జంక్షన్ (గన్నవరం) : ఓ వ్యక్తి పోగొట్టుకున్న బంగారు గొలుసును హనుమాన్ జంక్షన్ పోలీసులు కనిపెట్టి బాధితుడికి అప్పగించిన సంఘటన శనివారం జరిగింది. సిఐ అల్లు నరసింహామూర్తి కథనం ప్రకారం.. తణుకుకు చెందిన జాగర్లమూడి వెంకటేశ్వర్లు తన కుటుంబంతో ఈనెల 6వ తేదీన గుంటూరు నుండి తణుకు వెళుతూ సాయంత్రం 5 గంటల సమయంలో బోమ్ములూరు టోల్ గేట్ దగ్గర ఓ హోటల్ దగ్గర ఆగినప్పుడు తన కుమారుడి 3 కాసుల బంగారు చైన్ ను పోగొట్టుకున్నారు. పిదప బాధితుడు హనుమాన్ జంక్షన్ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసారు. వెంటనే పోలీసులు ఆప్రదేశానికి వెళ్లగా గొలుసు దొరికిందని హోటల్ సిబ్బంది పోలీసులకు అందించారు. దీంతో గొలుసు పొగొట్టుకున్న వెంటేశ్వర్లును స్టేషన్ కు పిలిపించి గొలుసును అందించారు.

సీనియర్ ఎల్ఐసి ఏజెంట్ మృతి



వెంకటేశ్వరరావు (ఫైల్)

ప్రజాశక్తి-గన్నవరం : కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గంలోని ఎల్ఐసి ఏజెంట్ల సంఘం నాయకులు, సీనియర్ ఏజెంట్ పరిటాల వెంకటేశ్వరరావు శనివార గుండె నొప్పితో మరణించారు. ఆయనకు ఇద్దరు పిల్లలున్నారు. కొన్నేళ్ల పాటు ఎల్ఐసి రంగంలో పనిచేస్తూ అధికారులు, ప్రజల మనలను పొందారు. మంచి ఏజెంట్ గా గుర్తింపు పొందారు. ఎల్ఐసి ఏజెంట్ల సమస్యల మీద పనిచేశారు. ఆయన మతి పట్ల ఎల్ఐసి ఏజెంట్ల సంఘం నాయకులు రాజబాబు, ఇతరులు ప్రగాఢ సంతాపం తెలిపారు. అదేవిధంగా దావాజీగూడెం గ్రామంలోని రాజకీయ నాయకులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. గ్రామంలోని స్మశానవాటికలు అంతిమక్రియలు నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కరెంట్ తీగలపై పడిన కొబ్బరిచెట్టు

- తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-కోడూరు : ఆకస్మాత్తుగా శనివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు కోడూరు 5వ వార్డ్ లో విఆర్ఓ కార్యాలయ ఎదురుగా ఉన్న కొబ్బరి చెట్టు విరిగి విద్యుత్ వైర్ల పై పడి రోడ్డు మీదకు ఒరిగింది. అదే సమయంలో రోడ్డు మీద వచ్చే ప్రయాణికులకు లేకపోవడంతో తటిలో ప్రమాదం తప్పింది. దీని కారణంగా ఆ ప్రాంతంలో సుమారు నాలుగు గంటలు విద్యుత్ అంతరాయం కలిగింది. ఈ విషయంపై స్పందించిన విద్యుత్ శాఖాధికారులు విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు.

కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: రాష్ట్ర ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట శాసనసభ్యులు సామినేని ఉదయభానుతో కలిసి జగ్గయ్యపేట పద్మశాలీ సంక్షేమ సంఘం ప్రతినిధులు విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో యన్.టి.ఆర్ జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) కె.మోహన్ కుమార్ను శనివారం కలిసి కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు సామినేని ఉదయభాను పద్మశాలీ కులానికి కమ్యూనిటీ భవనం కోసం స్థలాన్ని ఇప్పిస్తానని, భవన నిర్మాణానికి కషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ పద్మశాలీ సంక్షేమ సంఘం జగ్గయ్యపేట అధ్యక్షులు పెనుమల్లి చంద్రమౌళి, ఉపాధ్యక్షులు అల్లి రవిచంద్ మరియు మెటికల శ్రీనివాసరావు, ముసిని సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు అధ్వానం



గుంతలతో ఉన్న రోడ్డు

ప్రజాశక్తి - నందిగామ : 65వ నెంబరు జాతీయర హదారి విజయవాడ–హైదరాబాదు నందిగామ వై జంక్షన్ వద్ద డొంక రోడ్డు కన్నా అధ్వానంగా ఉంది. రోడ్డు పూర్తిగా గుంటలు పడిపోవటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఈ రహదారిపై ప్రయాణం చేయటానికి వాహనచోదకులు నరక యాతన పడుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రయాణికులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తి కాకపోవటం వల్ల ఇలా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలుస్తోంది. రెండు సంవత్సరాల నుండి ఈ ప్రాంతంలో జాతీయ రహదారి విస్తరణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. నందిగామ వద్ద హైవే బైపాస్ రోడ్డును ఆరు కిలోమీటర్ల మేర ఆరు వరుసలకు విస్తరించారు. మరో కిలో మీటరు వరకు పనులు చేయలేదు. రైతుల నుండి భూ సేకరణ చేయటంలో ఆలస్యం, అనంతరం నష్ట పరిహారం పంపిణిలో జాప్యం వల్ల రోడ్డువిస్తరణ పనులు వేగవంతంగా ముందుకు సాగటం లేదు. అదనపు నష్టపరిహారం కోసం రైతులు కోరుతున్నారు. రోడ్డు విస్తరణపనులకు 5,532 స్క్వేర్ మీటర్ల భూమి సేకరించాల్సి వచ్చింది. భూములను గుర్తించి భూ యజమానుల పేర్లతో ఉన్నతాధికారులకు పంపించారు. రైతులకు నష్ట పరిహారం చెల్లించి భూములు స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. రైతులకు నష్ట పరిహారం జాప్యం వల్ల రోడ్డు విస్తరణపనులు నిలిచిపోయాయి.

తరచూ రోడ్డు ప్రమాదాలు : గాయపడుతున్న ప్రయాణికులు.. లక్షల్లో ఖర్చులు

రోడ్డు విస్తరణపనుల జాప్యం వల్ల జాతీయరహదారిపై నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల వచ్చిన మున్నేరు వరదలకు జాతీయ రహదారి మరింత అధ్వానంగా తయారై గుంటలు పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాత్రి సమయంలో గుంటలు కనపడకపోవటం వల్ల జాతీయరహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రయాణికులు తీవ్రంగా గాయపడి లక్షల రూపాయలు ఖర్చులు భరించాల్సి వస్తోంది. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడటంతో పది లక్షల రూపాయల వరకు ఖర్చుయినట్లు తెలుస్తోంది. జాతీయ రహదారిపై ఏర్పడిన గుంటలను నందిగామ పోలీసులు పలుమార్లు పూడ్చినప్పటికీ యధావిధంగా గుంటలు ఏర్పడుతున్నాయి. ఐతవరం వద్ద మునేరు వరద పొంగటంతో జాతీయరహదారిపై వరద ప్రవేశించి అరకిలో మీటరు వరద పారటంతో వాహనాల రాకపోకలు రెండు రోజులు నిలిచిపోయాయి. జాతీయ రహదారి రోడ్డు డిజైనింగ్ లోపాలు వద్ద రహదారిపై వరద పారుతుండటం జరుగుతుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారిపై రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం తక్షణమే పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. నందిగామ వై జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదాలు జరగకుండా భూ సేకరణ చేసిన రైతులకు తక్షణమే పరిహారం అందించాలని, రోడ్డు విస్తరణపనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



సందర్శనకు వచ్చిన మంత్రి

వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరో సైన్సెస్‌ను సందర్శించిన శ్రీలంక మంత్రి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ :: వ్యాపార, వాణిజ్య, ఆహార భద్రతా శాఖ మంత్రి సతాశివం వయలేంద్రన్ శనివారం సాయంత్రం విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలోని డాక్టర్ వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరో సైన్సెస్ ను సందర్శించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో గుండె వైద్యాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చిన ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ గుంటూరు వరుణ్ ని మంత్రి అభినందించారు. చిన్న వయసులోనే డాక్టర్ వరుణ్ సాధిస్తున్న విజయాలను ప్రశంసించారు. మీ వంటి వైద్యుల సేవలు మా దేశ ప్రజలకు కూడా అవసరమని అన్నారు. ఆసుపత్రిని సందర్శించిన మంత్రికి చైర్మన్ డాక్టర్ వరుణ్, న్యూరో సైన్సెస్ విభాగం డైరెక్టర్ డాక్టర్ పువ్వాడ రామకృష్ణ స్వాగతం పలికారు.

విద్యార్థికి సన్మానం



విద్యార్థినిని సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - విజయవాడ : ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఈ నెల 9న ఏలూరులో నిర్వహిం చిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్య రూపకంలో రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి సాధించిన విజయవాడ నగరానికి చెందిన లాస్యశ్రీ విద్యార్ధినినీ పలువురు కార్పొరేటర్లు శనివారం ఘనంగా సత్కరించారు. 25వ డివిజన్ దుర్గాఅగ్రహారంలోని శ్రీ వాణి బాల విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్న లాస్యశ్రీకి నృత్యరూపకంలో మొదటి బహుమతి సాధించిన నేపధ్యంలో కార్పొరేటర్లు బంకా శకుంతలాదేవి, కొండాయిగుంట మల్లేశ్వరి, ఉమ్మడి వెంటేశ్వరరావు (చంటి), స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్ధినినీ స్కూల్‌లో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ..ప్రతి విద్యార్థి విద్యతో పాటు ఆట–పాటల్లో కూడా రాణించాలని కోరారు. రాష్ట్ర స్థాయి నృత్యపోటీల్లో మొదటి బహుమతి సాధించిన లాస్యశ్రీని అభినందిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో25వ డివిజన్ వైసిపి నాయకులు బంకా బాస్కర్, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాల కల్పనలో ముందంజ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మైక్రోస్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్‌లకు తగిన విధంగా ప్రోత్సాహం అందించడంలో అమెజాన్ సంస్థ కృషి చేస్తుందని సంస్థ కన్స్యూమర్ బిజినెస్ మేనేజర్ మనీష్ తివారి తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు సుమారు 62 లక్షలకుపైగాఈ ఎంఎస్ఎంఈలను డిజిటలైజ్ చేసినట్లు తెలిపారు. దీని వలన ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు, చిన్న తరహా వ్యాపారస్తులకు కూడా వ్యాపార అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. అమెజాన్ సంస్థ ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో అగ్రభాగాన ఉందని , 2025 నాటికి 20 లక్షల ఉద్యోగాలను కల్పించాలనేది తమ సంస్థ లక్ష్యమన్నారు.

సెలవుల్లో తరగతులపై ఆందోళన చేస్తాం :ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రభుత్వం ఇస్తున్నా రెండో శనివారం, సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించే విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, వాటి గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎం.సోమేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సి.హెచ్.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. ఈరోజు విజయవాడతో పాటు ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్, ప్రవేటు విద్యాసంస్థలు రెండో శనివారం, సెలవు రోజుల్లో సైతం విద్యార్థులకు ఉదయం నుండి సాయంత్రం వరకు తరగతులు నిర్వహించడం ఏమిటని వారి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించే విద్యాసంస్థల దగ్గర పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ కుట్రను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న రవికిశోర్

ప్రజాశక్తి - తిరువూరు : పేద, మధ్యతరగతి ప్రజలకు సైతం సేవలు చేస్తూ వారి జీవితాలలో మెరుగైన ఫలితాలను తీసుకొచ్చిన ప్రభుత్వ రంగ సంస్థ అయిన జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి)ని నిర్వీర్యం చేయటానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ఏజెంట్లు అందరూ ఐక్యమై తిప్పుకొట్టాలని ఎల్ఐసి ఏజెంట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి ఎఒఐ) రాష్ట్ర ప్రధాన కార్య దర్శి జి.రవికిశోర్ పిలుపునిచ్చారు. తిరువూరు ఎల్ఐసి శాటిలైట్ బ్రాంచ్ పరిధిలోని ఏజెంట్లు సమావేశం తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం పంతంగి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రవికిషోర్, ఎఒఐ మచిలీపట్నం డివిజన్ అధ్యక్షులు వై.గాంధీ రామ్మోహనరావు మాట్లాడుతూ ప్రీమియంపై జిఎస్టిని ఎత్తివేయాలని, ఏజెంట్లుకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, గ్రాడ్యుటీ పెంచి, లెక్కించే పద్ధతి మార్చాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ పెంచి, ప్రీమియం తగ్గించాలని, డైరెక్ట్ మార్కెటింగ్ ఎత్తివేయాలని, కీయా ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని తదితర డిమాండ్స్ సాధించేందుకు త్వరలో జోనల్ ఆఫీస్ ముందు త్వరలో ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శాటిలైట్ బ్రాంచ్ పరిధిలో ఎఒఐ కన్వీనర్‌గా గూడెల్లి రాఘవరావు, కో కన్వీనర్‌గా అంకులు, మరో ఐదుగుర్ని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. 24న జరగనున్న జనరల్ బాడీ సమావేశంలో పూర్తి కమిటీని ఎన్నుకుంటామని పంతంగి శ్రీనివాసరావు తెలిపారు.

కొత్త చైర్‌పర్సన్‌కే వైసిపి సభ్యుల మొగ్గు



రాజీనామాలు అందుకున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి తిరువూరు : ఇప్పటి వరకు తిరువూరు నగర పంచాయతీ చైర్మన్ మార్పిడి విషయం అధికారపార్టీలో నివురుగప్పిన నిప్పులా, వేడివేడిగా ఉన్న ముసుగు రాజకీయం శనివారం భూకంపంలా బద్దలైంది. గత చైర్‌పర్సన్ కస్తూరిబాయిని ఏకాకిచేసి 16 మంది కౌన్సిలర్లు అంతా ఏకమై ఒప్పందం ప్రకారం కొత్త వారికి ఇవ్వాలని సంతకాలు చేసి ఎంఎల్‌ఎకు అందజేశారు. ఎమ్మెల్యే కూడా వారికి మద్దతుగా నిలిచారు. మొత్తం 20 మంది కౌన్సిలర్లు ఉన్న తిరువూరు నగర పంచాయతీలో వైసిపికి చెందినవారు 17 మంది ఉన్నారు. 3వ వార్డు కౌన్సిలర్ ఉన్న ఛైర్‌పర్సన్ ఒంటరి అయ్యారనే దానికి 16 మంది కౌన్సిలర్లు అంతాఏకమై ఒప్పందం ప్రకారం చైర్‌పర్సన్ గత్తం కస్తూరిభాయి రెండేళ్ల పదవీకాలం పూర్తికావడంతో ఆమెతో రాజీనామా చేయించి 15వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్ చైర్మన్‌గా చేయాలని కోరుతూ సంతకాలు చేసిన పత్రాన్ని ముఖ్యమంత్రికి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రికి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకష్ణారెడ్డికి పంపమని ఎమ్మెల్యే రక్షణనిధికి ఇచ్చారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే తిరువూరులోని తన కార్యాలయంలో 16 మంది కౌన్సిలర్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి వెల్లడించారు. గౌరవప్రదంగా ఆమె వైదొలుగుతారని అనుకున్నామని, కానీ పార్టీ అధిష్టానం చెప్పినా వినకపోవడంతో కౌన్సిలర్లంతా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దష్టికి లిఖితపూర్వకంగా తన ద్వారా తీసుకెళున్నారని చెప్పారు. మున్సిపాలిటీ ఎన్నికల సమయంలో పార్టీ లిస్టులో చైర్మన్ (ఎస్‌పి జనరల్)గా ఆమె (కస్తూరిబాయి) పేరు లేదని, మోదుగ ప్రసాద్ పేరు మాత్రమే ఉందని చెప్పారు. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు కస్తూరిభాయి రెండేళ్లు చైర్‌పర్సన్‌గా కొనసాగుతారని చెప్పడంతో ఆమెతో పాటు వైస్ చైర్మన్లగా వెలుగోటి విజయలక్ష్మి, గుమ్మా వెంకటేశ్వరిలను కౌన్సిలర్లు ఎన్నుకున్నారన్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఆ తర్వాత మూడేళ్లు చైర్మన్ మోదుగు ప్రసాదు, వైస్ చైర్మన్లగా పరసా శ్రీనివాసరావు, తంగిరాల వెంకటరెడ్డిలు కొనసాగాల్సి ఉందన్నారు. గౌరవప్రదంగా రాజీనా మా చేయాలని పార్టీ అధిష్టానం చెబుతూ ఉండటంతో ఆమె చేయకపోగా నాపై లేనిపోని ఆరోపణలతో ముద్రించిన కరపత్రాలను పంచుతున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. చైర్మన్ పీఠం మార్పు అంశం తెరపై వచ్చిన అనంతరం మాత్రమే కరప త్రాలు పంచడం వంటి ఘటనలు జరుతున్నాయన్నారు. వైస్ చైర్మన్ పదవులకు వెలుగోటి విజయ లక్ష్మి, గుమ్మా వెంకటేశ్వరిలు రాజీనామా చేసిన లేఖను ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధికి అందజేశారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద నిరసన



బ్యాంకు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దశ్యం

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకు ముందు ఖాతా దారులు నిరసన తెలిపారు. వివరాలు చూస్తే... చందర్లపాడు మండలం కోనేపాలెం గ్రామానికి చెందిన షేక్ బాబావలి 45 గ్రాములు బంగారం తాకట్టు పెట్టి లక్ష 15 వేల రూపాయలు రుణం తీసుకున్నాడు. కొంతకాలం క్రితం మృతిచెందాడు. బంగారం రుణం వడ్డీతో కలిపి రూ.1,50,000 దాటింది. కుటుంబ సభ్యులు అంత మొత్తం చెల్లించుకోలేమని చెప్పడంతో లక్ష నలభై ఐదు వేలు చెల్లించమని బ్యాంక్ అధికారులు చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు రూ.1,45,000 చెల్లించి బ్యాంకు నుండి క్లియరెన్స్ లెటర్ తీసుకున్నారు. అయితే ఉన్నతాధికారి ఆదేశాలు మేరకు మరో 3500 రూపాయలు చెల్లించాలని బ్యాంకు మేనేజర్ కోరడంతో బాధితులు చెల్లించలేమంటూ బ్యాంకు ముందు బైఠాయించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సయ్యద్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సదుపాయం కల్పిస్తున్న అల్ట్రాటెక్ సంస్థ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతిపెద్ద సిమెంట్, రెడీమిక్స్ కాంక్రీట్ కంపెనీ అయిన అల్ట్రాటెక్ సంస్థ తాగునీటి సౌకర్యం కల్పించేందుకు నిర్ణయించిందని సంస్థ ప్రతినిధి కె.ఎస్.రావు ఒక ప్రకటనలో తెలిపారు. తమ సంస్థ సమీకృత సిమెంట్ తయారీ యూనిట్ బాలజీ సిమెంట్ వర్క్స్ ద్వారా విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లాలోని ఆరు గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు.

గుడి కూల్చివేతపై కొనసాగిన నిరసన

ప్రజాశక్తి - నందిగామ : స్థానిక డివిఆర్ కాలనీలో ముత్యాలమ్మ గుడి కూల్చివేతకు నిరసనగా శనివారం ఆందోళన నిర్వహించారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఆకస్మికంగా అధికారులు వచ్చి గుడిని కూల్చివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే ముత్యాలమ్మ విగ్రహం పెట్టి పూజలు నిర్వహించారు. పాల పొంగళ్లు నిర్వహించారు. కూల్చిన ప్రదేశంలోనే మళ్లీ గుడిని నిర్మిస్తామన్నారు. ఈ నిరసనకు సంఘీభావంగా సిపిఎం నాయకులు పాల్గొన్నారు. ఆందోళనకు ఉపక్రమించిన సిపిఎం నాయకులను పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. మధ్యాహ్నం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కటారపు గోపాల్, నాయకులు సయ్యద్ ఖాసీం మాట్లాడుతూ భక్తుల మనోభావాలకు విరుద్ధంగా మున్సిపల్ అధికారులు వ్యవహరించారని విమర్శించారు. ఆకస్మికంగా వచ్చి గుడిని కూల్చివేశారన్నారు. మరోవైపు టిడిపి, వైసిపి నేతల ఆధిపత్య పోరులో భాగంగా గుడిని కూల్చివేశారని స్థానికులు విమర్శిస్తున్నారు. కక్ష సాధింపుతోనే గుడిని కూల్చారని టిడిపి నేతలు విమర్శిస్తున్నారు. తాము అధికారంలోకి రాగానే పునర్నిర్మిస్తామని మాజీ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ఈ స్థలంలో జిల్లా పరిషత్ పాఠశాల, కమ్యూనిటీ హాలు, అంగన్వాడీ భవనాల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యా యని వైసిపి 18వ వార్డు ఇన్చార్జి బండారు వెంకట్రావు పేర్కొన్నారు. కొంత మంది వ్యక్తులు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి గుడి పేరుతో అక్రమ కట్టడాలు కట్టారని, వారికి అధికారులు నోటీసులు ఇచ్చిన పట్టించుకోకపోవడంతో కూల్చారన్నారు.



ఓటర్ల జాబితా పున:పరిశీలన 65 శాతం పూర్తి

• రెవెన్యూ డివిజనల్ అధికారి ఐ.కిషోర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలో ఓటర్ల రీ వెరిఫికేషన్ ప్రక్రియ ఇప్పటివరకు 65 శాతం పూర్తయిందని రెవెన్యూ డివిజనల్ అధికారి ఐ. కిషోర్ స్పష్టం చేశారు. శనివారం ఆయన కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియ అభ్యంతరాలపై మభ్యంతర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ డి ఓ మాట్లాడుతూ మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలో 83,596 గహాలు ఉన్నాయని వీటి పరిధిలో 1,87,32 ఓట్లు ఉన్నాయన్నారు. వీటిలో ఇప్పటివరకు 52,734 ఇళ్ళను విజిట్ చేయడం జరిగిందని వీటి పరిధిలో 1, 14,159 ఓటర్లను కలసి వెరిఫికేషన్ పూర్తి చేయడం జరిగిందన్నారు. వీటిలో ఫారం (6)కొత్త ఓటర్లకు 1,677 ఫారం(7) తీసివేయడానికి 1406, 146 ఫారం(8)ఓటు బదిలీ కొరకు 3,434 దరఖాస్తులు వచ్చాయన్నారు. అలాగే ఒక పోలింగ్ స్టేషన్ లో ఉండాల్సిన ఓట్లు వేరే పోలింగ్ స్టేషన్ లోకి మార్చడం వంటివి 5361 ఓట్లను గుర్తించడం జరిగిందన్నారు. ఇవి కాక ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ చంద్రయ్య, బిజెపి, కాంగ్రెస్, వైకాపా, సిపిఎం, టిడిపి,సీపీఐ,జన సేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ ఐ. కిషోర్



తోపుడుబండ్లు అందజేత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ప్రజలకు ఉపయోగపడే ఏ కార్యక్రమానికి అయినా సహకారం అందిస్తానని టిడిపి నాయకులు వెనిగండ్ల రాము అన్నారు. మండలంలోని అంగలూరు గ్రామంలో శనివారం వెనిగండ్ల ఫౌండేషన్ ద్వారా వికలాంగునికి ట్రై సైకిల్, మరియు చిరు వ్యాపారులకు తోపుడుబండ్లు అందజేశారు. వాకర్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపును రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గంలో ప్రజలకు ఉపయోగపడే ఏ కార్యక్రమని కైనా ఆయన సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వెనిగండ్ల ఫౌండేషన్ ప్రతినిధులు, వాకర్స్ ఫౌండేషన్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

పేదరికం నిర్మూలనే ధ్యేయంగా మహాశక్తి పథకం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : తెలుగుదేశం తోనే మహిళా సంక్షేమం సాధ్యం అని నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు లంకి శెట్టి నీరజ అన్నారు. శనివారం 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ నాయకురాలు పి. విమల గాయత్రి ఆధ్వర్యంలో తెలుగు మహిళలు ప్రతి ఇంటికి వెళ్లి, మహా శక్తి పదకాన్ని వివరించారు.ఈ సందర్భంగా లంకి శెట్టి నీరజ మీడియాతో మాట్లాడుతూ ప్రతి గడపకు వెళ్లి, చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే నిబంధనలు లేకుండా , వివక్ష కు తావు లేకుండా తల్లికి వందనంలి పేరుతో మీ ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి 15 వేలు,ఆడబిడ్డ నిధిలి నుంచి 18 ఏళ్ల నిండిన ప్రతి స్త్రీకి నెలకు 15 వందలు చెల్లించడం జరుగుతుందన్నారు.అలాగే దీపం పేరుతో ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వటం జరుగుతుందన్నారు. అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ నగర కార్పోరేషన్ అధ్యక్షురాలు, ఎన్ వసంత కుమారి, తెలుగుదేశం పార్టీ కష్ణాజిల్లా ప్రచార కార్యదర్శి, 45వ డివిజన్ టిడిపి ఇంచార్జ్, పి.వి. ఫణి కుమార్, పార్టీ నాయకులు, పామర్తి నరేష్, గంజాల రవికుమార్, కొల్లేరు సత్యనారాయణ లతోపాటుగా తెలుగు మహిళలు, కార్పోరేటర్ దేవరపల్లి అనిత పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-బంటుమిల్లి : జూలై నెలాఖరులో కురిసిన అతి భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు, కౌలు రైతులకు ఎకరాకు 13 వేల రూపాయలు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బంటుమిల్లిలో శనివారం ఆయన మాట్లాడుతూ బంటుమిల్లి , కత్తివెన్ను, పెడన, గూడూరు గుడివాడ ,గన్నవరం, పెనమలూరు తదితర మండలాల్లో వరి పొలాలు ముంపుకు గురై రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. గతంలో 2020 సంవత్సరంలో ఏప్రిల్ నెలలో కురిసిన అకాల భారీ వర్షాలకు , వడగండ్లవనకు కత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లో దాదాపు 4520 మంది రైతులకు సుమారు మూడు కోట్లు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం ఇంతవరకు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ సంఘం బంటుమిల్లి మండల కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్, సమ్మెట నాంచారయ్య దూసనపూడి పరంధామయ్య ,దూసనపూడి రామారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

సమస్యలపై చర్చించకపోవడం విచారకరం : టిడిపి


మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : పర్యాటక సాంస్కృతిక అభ్యుదయ శాఖామంత్రి ఆర్కే రోజా అవనిగడ్డకు విచ్చేయగా దివిసీమలో పర్యాటక రంగం గురించి ఏమాత్రం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు చర్చించకపోవడం విచారకరమని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం అవనిగడ్డ నియోజకవర్గ సమీక్ష సమావేశానికి మంత్రి రోజా వస్తే నియోజకవర్గం మంత్రి దష్టికి తీసుకొని వెళ్లకుండా సమస్యలు పరిష్కారం చేయాలని ఆలోచన లేని ఎమ్మెల్యే రమేష్ బాబు అన్నారు. ఒకపక్క నియోజకవర్గ పరిధిలో పంట కాలువలకు సరిపడా సాగునీరు విడుదల చేయకపోవడంతో నాట్లు వేసుకున్న పొలాలు నెరులిచ్చి పంటను కాపాడుకోలేని దుస్థితిలో నేడు రైతులు ఉన్నారని, మరోపక్క డ్రైన్లు బాగు చేయకపోవడంతో వందలాది ఎకరాల పొలాలు ముంపుకు గురై రైతులు నష్టపోతున్నారన్నారు. రైతుల సమస్యలు సమీక్ష సమావేశంలో మంత్రి తో ఎమ్మెల్యే చర్చించాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు. దివ్య సీమకు రక్షణ వారధిగా ఉన్న కరకట్టలు సముద్ర కట్ట అభివద్ధికి నోచుకోకుండా దయానియస్థితిలో ఉంటే కనీసం మంత్రిని అడిగి నిధులు సమకూర్చుకోవాల్సిన బాధ్యత లేదని ప్రశ్నించారు. అందువల్ల నియోజకవర్గ సమస్యల విషయంలో ఎమ్మెల్యే మంత్రి దష్టికి తీసుకువెళ్లడంలో పూర్తిగా వైఫల్యం చెందారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఘంటసాల రాజమోహన్రావు, ఎలవర్తి చిన్న, షేక్ బాబావాలి, గుంటూరు వినయ్, బర్మా శ్రీనివాసరావు, తండు గంగాధర్, రేపల్లె అంకినీడు తదితరులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు నివాళి



ప్రజాశక్తి- ఉయ్యూరు : స్వాతంత్ర సమరయోధులు, స్వాతంత్రోధ్యమంలో అమరులను స్మరించుకుని నివాళు లర్పించడం వారిక మనమిచ్చే నిజయమైన గౌరవమని ఉయ్యూరు ఇంగ్లీషు మీడియం. స్కూల్ డైరెక్టర్ ఎంకె బాబు అన్నారు. అజాదికా అమత్ మహెూత్సవ్ లో భాగంగా జాతీయపతాక రూపశిల్పి పింగళి వెంకయ్య స్వగ్రామమైన బట్లపెనుమర్రు గ్రామాన్ని విద్యార్థులతో కలసి శనివారం సందర్శించారు. ఈసందర్భంగా గ్రామంలో భారీ జాతీయ ప తాకంతో ప్రదర్శన నిర్వహించి పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమం, స్వాతంత్రం సిద్ధించిన తరువాత పింగళి దేశ భక్తిని విద్యార్థులకు వివరించారు. దేశకోసం అమరులైనవారు, స్వాతంత్ర సమరయోధుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. రానున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకకు పింగళి కుటుంబ సభ్యులను ఆహ్వానించి గౌరవించనున్నట్టు తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



ప్రజాశక్తి గూడూరు : గూడూరు మండలం చిట్టిగూడూరు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకాన్ని ఎం పి పి సంగా మధుసూదనరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన మంచి ఆహారం అందించాలని ఉపాధ్యాయలకు సూచించారు.జడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు,మండల పార్టీ అధ్యక్షులు పర్ణం. పెదబాబు, ఎంపీటీసీ జక్కా ధర్మారాయుడు,మరియు సర్పంచ్ లంకా సుబ్రహ్మణ్యం,పి ఎ సి ఎస్ డైరెక్టర్ వేము ఆనంద్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఓపెన్ చెస్ పోటీలు

ప్రజాశక్తి-గుడివాడ : 11వ ఎన్‌టిఆర్ మెమోరియల్ అధ్వర్యంలో ఈ నెల 13న గుడివాడ స్కూల్స్ ఓపెన్ చెస్ పోటీలు నిర్వహిస్తునట్లు ఎన్‌టిఆర్ స్టేడియం కమిటి సంయుక్తా కార్యదర్శి పర్వతనేని ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ ఆదివారం ఎన్‌టిఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగే ఈ పోటీలను 2టౌన్ సిఐ బి.తులసీధర్ ప్రారంభిస్తారన్నారు.

ముగిసిన స్టూడెంట్ కన్వెన్షన్



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో రజతోత్సవ వేడుకల్లో భాగంగా రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఐఎస్‌టిఇ అనుబంధ నేషనల్ లెవెల్ స్టూడెంట్ కన్వెన్షన్, అవార్డ్ ఫక్షన్ శనివారం ముగిశాయి.ఈ కార్యక్రమంలో జరిగిన సాంకేతిక పత్రాల సమర్పణ పోటీల్లో పాలిటెక్నిక్ పరిధిలో వి.ఎస్. ముస్కాన్, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల తాడ్రపాడునకు ప్రథమ స్థానం, ఏ ఏ ఎన్ ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ పాలిటెక్నిక్ గుడ్లవల్లేరు చెందిన ఆర్.ఐ.వర్ధన్, పి హరిబాబులకు ద్వితీయ స్థానం, ఎం.మణికంఠ, పి.షణ్ముఖ మనీష్‌లకు తతీయ స్థానం లభించింది. ఇంజనీరింగ్ విభాగంలో, శ్రీ విష్ణు మహిళా ఇంజనీరింగ్ కళాశాల భీమవరంకు చెందిన వి. ఆకాంక్ష, టి. ప్రణతిలకు ప్రథమ స్థానం, శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల (ఎస్.ఆర్.జిఇ.పి) కు చెందిన టి. రిషికా దేవి, ఎన్. విష్ణుప్రియలకు ద్వితీయ స్థానం, శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాల నందమూరుకు చెందిన కె. కష్ణప్రియు, ఎం.డి. అమీనాచీలకు తతీయ స్థానాలు లభించాయి. సాంకేతిక పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలో పాలిటెక్నిక్ విభాగంతో పి.శ్రీలక్ష్మి, పి. నందిని ఎస్.వి ఐ.టి. పాలిటెక్నిక్ కు మొదటి స్థానం, వై యగాయత్రీ దేవి, వి. పూజలు ఎఎ ఎన్.ఎం. అండ్ వి.వి ఆర్.ఎస్.ఆర్. పాలిటెక్నిక్ కు ద్వితీయ స్థానం, అదే కళాశాలకు చెందిన సి.హెచ్.కె.ఎస్. పాల్, కె చేతన్ క్రిష్ణన్ లకు తతియ స్థానాలు రాగా, ఇంజినీరింగ్ విభాగంలో డిఎం.ఎస్.ఎస్.పిహెచ్ ఇంజియరింగ్ కళాశాల మచిలీపట్నంకు చెందిన కె ధన్యజ, సిహెచ్. భాగ్యశ్రీ, లెండి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి విశాఖపట్నం కు చెందిన వి.జ్ఞానేశ్వర రావు, వై- కార్తీక్ లకు ద్వితీయ స్థానం శ్రీ విష్ణు మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన కె. ప్రతిక, పి. శ్రీజలకు తతీయ స్థానాలు లభించాయి. ఈ సందర్భంగా ఐఎన్‌టిఇ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సల్ సభ్యులు డాక్టర్ పి రవీంద్రబాబు పవర్ పాయింటర్(ప్రదర్శన ద్వారా ఐ.ఎస్.టి. ఇని గురించి విశదీకరించారు. అనంతరం జరిగిన అవార్డ్స్ ఫంక్షన్ కు విశేష అతిథిగా న్యూఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ ప్రతాప్ సింగ్ కికాసా దేశాయ్, వ్యవహరించగా, ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ కె.హేమచంద్ర రెడ్డి, ఎసి.ఎస్. సి.హెచ్.ఇ, ఈ గౌరవాధులుగా (ప్రొఫెసల్ లాల్ కిషోర్ మాజీ వైస్ ఛాన్సలర్, జెఎన్‌టియు, అనంతపురము, జెఎన్‌టియుఎల్‌జివి విజయనగరం టైఫ్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.వి. సుబ్బయ్య, ఏ.ఎస్.ఇ.ఏ.పీ సెక్షన్ ప్రొఫెసర్ జి.రంగ జనార్ధన వ్యవహరించారు.

దెబ్బతిన్న రోడ్లు, పైపులైన్ల పనులు చేపట్టండి : మంత్రి తానే



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తానేటి వనిత; చిత్రంలో ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, కలెక్టర్ డిల్లీరావు తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ : ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వచ్చిన వరదలకు నష్టపోయిన రహదారులు, తాగునీటి పైపులైన్లు, కాల్వ గట్ల పనులను తక్షణమే చేపట్టి త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర హోం మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి తానేటి వనిత అధికారులను ఆదేశించారు. విజయవాడలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో శనివారం ఆమె జగ్గయ్యపేట నియోజకవర్గ అభివద్ధి పనులపై సమీక్ష సమావేశాన్ని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు సామినేని ఉదయభానుతో కలిసి నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి తానేటి మాట్లాడుతూ జగ్గయ్యపేట నియోజకవర్గ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను మాట్లాడుతూ సమీక్షలో చర్చించిన శాఖల వారీ అంశాలను సంబంధిత అధికారులు త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ సమావేశంలో సమీక్షించిన అభివద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో డిఆర్వో కె.మోహన్ కుమార్, జడ్‌పి సిఇఒ జ్యోతిబసు, ఆర్డీవో ఆర్.రవీంద్రరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందజేత

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 21, 22వ తేదీల్లో నిర్వహించనున్న ఎపి ఎన్జీవో రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి హాజరు కావాలని కోరురూ ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యా సాగర్ ఆధ్వర్యంలో పలువురు జిల్లా, నగర కార్యవర్గ సభ్యులు శనివారం జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీ రావుకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నగర కార్యవర్గ సభ్యులు యం.డి. ఇక్బాల్, డి. సత్యనారాయణ రెడ్డి రామకష్ణ, బి వి.రమణ వి.వి.ప్రసాద్, మధుసూదనరావు, కె.శివలీల, దిలీప్ కుమార్, రాజశేఖర్ తదితరులు వున్నారు



ఉద్యమం ఉధృతం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నత పాఠశాలలు ప్రభుత్వ రంగం నుండి అదృశ్యమయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా విద్యా రంగాన్ని ప్రైవేటీకరించే విధానాలనే అవలంభిస్తున్నాయని అన్నారు. ఉపాధ్యాయులు, అధికారులు, తల్లిదండ్రుల సమిష్టి కృషితోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందనే విషయాన్ని ప్రభుత్వ పెద్దలు గ్రహించాలన్నారు. విజయవాడలో ఫ్యాఫ్టో జిల్లా చైర్మన్ సయ్యద్ ఖాసిం అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎ.విద్యాసాగర్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పి.మనోహర్ కుమార్, ఫాప్టో రాష్ట్ర నాయకులు ఇమాం బాషా, ఎపిటిఎఫ్ సీనియర్ నాయకులు పి.పాండురంగ వరప్రసాదరావు, ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎస్‌టియు నాయకులు తిమ్మన్న, యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, సుందరయ్య, ఎస్‌టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భిక్షమయ్య, అనురాగప్రసాద్, బిటిఎ జిల్లా అధ్యక్షులు ఇంతిరాజు, డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు అరుణ, డిటిఎఫ్ సీనియర్ నాయకులు పి.కృష్ణయ్య, ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు టి.పూర్ణచంద్రరావు, ఒపిడిఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.హనుమంతరావు, జనసాహితీ రాష్ట్ర అధ్యక్షులు దివి కుమార్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మచిలీపట్నంలో ఫ్యాప్టో చైర్మన్ బి.లంకేష్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు కె.ఎ.ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్, కో సెక్రటరీ జనరల్ బి.కనకరావు, రాష్ట్ర నాయకులు జె.లెనిన్ బాబు, కొమ్ము ప్రసాద్ ,ఎన్‌ఎస్‌ఆర్ ప్రసాద్, ఫ్యాప్టో నాయకులు బి.వి.రామారావు, ఇమ్మానుయేలు, ఎం.శ్రీనివాసరావు, కె.శేషగిరిరావు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజుకు కొమ్మినేని సత్కారం

ప్రజాశక్తి - విజయవాడ : సీనియర్ జర్నలిస్ట్, విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష్యులు నిమ్మరాజు చలపతిరావును ఎపి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు సత్కరించారు.శనివారం ఏలూరు జిల్లా కలిదిండిలో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో నిమ్మరాజు కుటుంబ సభ్యులు, జర్నలిస్టు మిత్రుల సమక్షంలో శాలువా, జ్ఞాపిక, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ కార్యక్రంలో మీడియా అకాడమీ కార్యదర్శి ఎం.బాలగంగాధర్ తిలక్ పాల్గొన్నారు.

మణిపూర్‌లో దాడులకు నిరసనగా ర్యాలీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలో ఎస్ జి ఎస్ కాలేజీ వద్ద నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసి) ఆధ్వర్యంలో శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి సంఘీభావంగా టీడీపీ జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి శ్రీరాం రాజగోపాల్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు వెంకట కష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. సిపిఎం పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయంలో మణిపూర్ లో హింసను ఆపాలని కోరుతూ తాసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు కోట కష్ణ, ఎస్ రామనాథం, రాంప్రసాద్, ముస్లిం నాయకులు షేక్ సత్తార్, షేక్ మదార్, షేక్ మాబ్ మియా, పాస్టర్ ప్రవీణ్ కుమార్, పాస్టర్ జోసఫ్ కిరణ్, పాస్టర్ రవి, సిపిఎం పార్టీ నాయకులు కోట కష్ణ, ఎస్ రామనాథం, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ అన్న క్యాంటీన్ ఏర్పాటు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : టీడీపీ సీనియర్ నాయకులు కేశినేని శివనాద్ (చిన్ని) సౌజన్యంతో, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర జిల్లాల ఇంఛార్జి బుద్ధా వెంకన్న, తెలుగుదేశం పార్టీ బీసీ మైనార్టీ నాయకులు, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా ఆధ్వర్యంలో కేశినేని ఫౌండేషన్ వారిచే నడపబడుతున్న మొబైల్ అన్న క్యాంటీన్ శనివారం 54వ డివిజన్ ముషాఫిర్ ఖానా వద్ద ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆన్సర్, తుపాకుల వెంకటేశ్వరరావు, ఈగల సాంబ, దంగేటి శివరాంప్రసాద్, గుండు సుధాకర్, బక్కం సత్తిబాబు, ముద్దాన నారాయణ రావు, శ్రీలం దుర్గారావు, దుంపల రాంబాబు, బొమ్మిడి రాము, రాజగిరి అశోక్ పాల్గొని అన్నదానం నిర్వహించారు.



ప్లీనరీ సమావేశాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఎన్టీఆర్‌జిల్లా ప్లీనరీ సమావేశాలు ఈ నెల 19, 20 తేదీల్లో విజయవాడలో జరిగే సమావేశాలు జయప్రదం చేయాలని పట్టణంలో సుందరయ్య భవనంలో శనివారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎం.సోమేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా కమిటీ సభ్యులు కే.రాజు, మండల నాయకులు భరత్, ప్రదీప్, వంశీ, కమల్ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు నీరందించాలి : కొల్లు


పంటలను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : బందరు మండలం లోని బుద్ధలపాలెంలో గ్రామం లో ఎండిపోయిన వరి పంటను మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ళ నారాయణ రావుతో కలసి శనివారం కొల్లు రవీంద్ర పరిశీలించారు. ఈ సంద్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో రైతులను పట్టించుకునే నాధుడే లేదని, మొన్నటి వరకు అధిక వర్షాలు వల్ల పంటలు నీట మునిగి రైతులు నష్టపోతే, ఇప్పుడు చూస్తే నీరు లేక పంటలు ఎండిపోయి నష్టపోతున్నారన్నారు. అసలు ఈ ప్రభుత్వానికి వాటర్ మ్యానేజ్ మెంట్ మీద కనీస అవగాహన లేదనీ దుయ్యబట్టారు. మంత్రులు, ఎమ్మెల్యేలు వాళ్ల వాళ్ళ వ్యాపారాలు, అవినీతి, అక్రమ సంపాదనలో బిజీగా వున్నారని, రైతుల గురించి ఎవడికి పడుతుందనీ విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే నీరు వదలి పంటలు నష్టపోకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గొపు సత్యనారాయణ, కుంచె నాని, క్లష్టర్ ఇంఛార్జి సోమశేఖర్, రైతు నాయకులు ఆల్ల మాధవ, బడే రమణ, పామర్థి లక్ష్మణ్, మీనవల్లి నాగేశ్వర రావు పాల్గొన్నారు.

రహదారి గండికి తూము ఏర్పాటు


తూము ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఘంటసాల : స్థానిక ఇందిరాకాలనీ రోడ్డులో తూము ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు తొలగించిన సర్పంచ్ డి.విజయ లక్ష్మికి, అధికారులకు కాలనీ వాసులు కతజ్ఞతలు తెలియజేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఘంటసాల మండలం లంకపల్లి ఇందిరా కాలనిలో వర్షపునీరు నిలిచి పోవడంతో పంచాయతీ వారు రోడ్డుకు గండి కొట్టారు. దీంతో విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న సర్పంచ్ డి.విజయలక్ష్మి, వైసీపీ నేత పద్మారావు ఎంపీడీఓ కె.వెంకట సుబ్బారావు సూచన మేరకు ఈఓ బి.అర్జునరావుతో మాట్లాడి శనివారం గండిని జేసిబీ సాయంతో తవ్వించి తూము ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చేశారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన వెంటనే పరిష్కరించిన ప్రజా ప్రతినిధులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అర్చకులపై దాడికి నిరసన

ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం: దేవాలయాల్లో పూజలు చేసే అర్చకులపై దాడులకు పాల్పడటం ఘోరమైన ఘటన అని ఇబ్రహీంపట్నం మండల అర్చకుల సంఘం తీవ్రంగా ఖండించారు. ఇబ్రహీంపట్నంలో వేంచేసి ఉన్న శ్రీ దాసాంజనేయ స్వామి వారి దేవస్థానంలో అర్చక స్వాములు సమావేశమై అర్చకులపై జరిగినదాడికి నిరసన తెలిపారు. భీమవరంలో పంచరామ క్షేత్రంలో ప్రధాన అర్చకునిపై వైసిపి నాయకులు చేసిన దాడిని బ్రాహ్మణ సంఘాలు, ఎపి అర్చక సమాఖ్య సభ్యులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలో ఉన్నటువంటి అర్చక సోదరులు, దేవాలయాలకు వచ్చేటువంటి భక్తులు అందరూ ఇలాంటి దుశ్చర్య చేసినటువంటి వారికి కఠినంగా శిక్షించాలని నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు వి.వెంకటరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - తిరువూరు : విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు, మహనీయుల జీవిత చరిత్రలు చదివితే, ఆత్మ విశ్వాసంతో ఉన్నత స్థాయికి చేరుకోవ డానికి అవకాశాలు వుంటాయని పంచాయతీ కార్యదర్శి పి.ఫణి గోపాల్ అన్నారు. మండలంలోని గానుగపాడులో మన ఊరు, మన గ్రంథాలయం కార్యక్రమం ముగింపు సందర్భంగా విద్యార్థులకు అయన పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. జెవివి జిల్లా కార్యదర్శి ఎం.రాంప్రదీప్ మాట్లాడుతూ దాతల సహకారంతో గత నెల రోజుల వ్యవధిలో రూ.ఇరవై వేలు విలువ చేసే వేయి పుస్తకాలను రెండు వందల మంది విద్యార్థులకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

విద్యార్థులు పరిశోధనాత్మకంగా ముందుకు సాగాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విద్యార్థులు తమ తమ కోర్సులకు సంబంధించిన రంగాలపై పట్టు సాధించినప్పుడే చక్కని అవకాశాలను పొందుతారని వేద గేట్ అకాడమీ డైరెక్టర్ వేదాంతం ఎన్‌వీఎస్‌బీఎస్ శర్మ అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో 'ఇంజనీరింగ్ ద్వారా ఉన్నత విద్యా, ఉపాధి అవకాశాలు' అంశంపై సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో వివిధ అంశాలలోని కాన్సెప్ట్‌లను వినియోగించి చిన్నచిన్న ఎలక్ట్రికల్ సర్క్యూట్లను విద్యార్థులు తయారు చేయవచ్చన్నారు. వాటి తయారీ అంశాలపై విద్యార్థులను అవగాహన పరిచారు. కేవలం తరగతి గది బోధనకు పరిమితం కాకుండా విద్యార్థులు పరిశోధనాత్మకంగా ముందుకు సాగాలన్నారు. తద్వారా ఆయా అంశాలపై సాధికారతను సాధించాలని సూచించారు. తమతమ రంగాలపై పట్టు సాధించిన విద్యార్థులకు అద్భుతమైన అవకాశాలు చేరవవుతాయని వివరించారు. కళాశాల కార్యదర్శి పీ లక్ష్మణస్వామి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జే లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ పతంజలిశాస్త్రి, ఈఈఈ విభాగాధిపతి ఏ శేఖర్ సునీల్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని వినూత్న నిరసన


పడవపై ప్రయాణం చేస్తూ నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : ప్రభుత్వానికి అన్ని రకాలైన విజ్ఞప్తులు నిరసనలు ఆందోళనలు చేపట్టినప్పటికీ అవనిగడ్డ-కోడూరు రహదారిని నిర్మించకపోవడంతో జనసేన పార్టీ శనివారం వినూత్నంగా నిరసన తెలిపింది. ఆ పార్టీ నాయకులు గుడివాక శేషుబాబు ఆధ్వర్యం లో అవనిగడ్డ కోడూరు రోడ్డు గోతులు మాయం కావడంతో అది ఏమాత్రం ప్రయాణానికి అనుకూలంగా లేదని దీనితో పడవతో ప్రయాణం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు శేషుబాబు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా అవనిగడ్డ కోడూరు ప్రధాన రహదారి పెద్ద పెద్ద గోతులుగా మారి నడవడానికి వీలులేని పరిస్థితి ఏర్పడడంతో రహదారి పనులు చేపట్టాలని పంట కాలవలో పడవ ప్రయాణం చేయడం ద్వారా నిరసన తెలుపుతున్నట్లు చెప్పారు. శుక్రవారం అవనిగడ్డకు విచ్చేసిన జిల్లా ఇన్చార్జి మంత్రి ఆర్కే రోజా నియోజకవర్గంలోని వివిధ శాఖల పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించినప్పటికీ ఈ రహదారి ప్రస్తానం రాకపోవడంతో రహదారి మరుగున పడిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మించకపోతే భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండల పార్టీ అధ్యక్షులు మరే గంగయ్య, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు బాసు నాంచారయ్య, నాయుడు భోగాది, లక్ష్మీరాజ్యం, ఎంపీటీసీ బొప్పన భాను, పిట్టలంక సర్పంచ్ వెంకటేశ్వరరావు, తుంగల నరేష్ తదితరులు పాల్గొన్నారు

తాత్కాలికంగా రైల్వే గేటు మూసివేత

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : పెడన-మచిలీపట్నం మధ్య కల రైల్వే గేట్ నెం.35 బుద్దాల పాలెం-బైరాగి పాలెం గేటు వద్ద ట్రాకు మరమత్తు పనులు జరుగుతున్నందుందున ఈ నెల14 ఉదయం 7 గంటల నుండి ఆగస్టు16 సాయంత్రం 7 గంటల వరకు ,రైల్వే గేటు తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు మచిలీపట్నం సీనియర్ సెక్షన్ ఇంజనీర్ వక ప్రకటనలో తెలిపారు. కావున వాహనదారులు గమనించాలని కోరారు.


ఓటరు పరిశీలన చేస్తున్న తహసీల్దార్

సమగ్ర ఓటరు సర్వే పరిశీలన

ప్రజాశక్తి - మొవ్వ : మొవ్వ మండలంలోగల 21 గ్రామ పంచాయతీలోని 54 పోలింగ్ కేంద్రాలలో కొనసాగుతున్న సమగ్ర ఓటరు సర్వేను మండల తహసీల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్ పరిశీలించారు. ఆయా గ్రామాలలోని బిఎల్ ఓ లు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తున్న సమయంలో ఈయన పరిశీలన చేశారు. సిబ్బంది గుర్తింపు కార్డులు జాబితాలోని తప్పుల సవరణను చేపట్టడం, స్పష్టత లేని ఫోటోలు తొలగించి ఆ ఓటు యజమాని మంచి ఫోటోని మార్పు చేయడం, చిరునామా తప్పులు సరి చేయడం లాంటి కార్యక్రమాలతో పాటు కొత్త ఓటర్ చేరికపై అవగాహన కలిగించారు. బి ఎల్ ఓలు పి.ఉమామహేశ్వరరావు, జి. ఫణిరాజేంద్రకు ఈ సందర్భంగా వారికి పలు సూచనలు ఇచ్చారు. **ప్రజాశక్తి-గుడివాడ :** పట్టణ పరిధిలోని ఓట్లుకు సంబంధించి బూత్‌లెవల్ సిబ్బందితో ఎన్నికల అధికారులు పద్మావతి, మురళీకృష్ణ, గోపాలరావులు సమీక్షా సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 72వ అసెంబ్లీ నియోజకవర్గంలోని 98 సెంటర్ల ఎన్నికల బూత్‌లెవల్ సిబందితో ఎన్నికల అధికారులు ఓట్లు వివారల పక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బూత్‌లెవల్ సిబ్బంది, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ జెండాల పంపిణీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: ఆగస్టు 15 స్వాతంత్య దినోత్సవాన్ని పురస్కరించుకొని త్రివర్ణ జాతీయ జండాను ప్రతి ఇంటిపై ఎగురవేయాలనే ఉద్దేశంతో దేశ వ్యాప్తంగా పోస్టల్ శాఖ చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక విజ్ఞాన్ హై స్కూల్‌లో విద్యార్థులకు, ఉపాధ్యాయ సిబ్బందికి త్రివర్ణ పతాకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ శ్రీమతి తన్నీరు సుధారాణి మాట్లాడుతూ జాతీయ భావాన్ని పెంపొందించేలా పోస్టల్ శాఖ దేశ వ్యాప్తంగా చేపట్టిన ఈ హర్ ఘర్ తిరంగా కార్యక్రమం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ యూనియన్ నాయకులు వసంతరావు, పోస్ట్ మాస్టర్ రామచంద్ర నాయక్ పాల్గొన్నారు.అనంతరం తపాల శాఖ ద్వారా 100 జాతీయ జెండాలను కొనుగోలు చేసి రాజన్న ఉచిత భోజన కార్యక్రమం వద్ద ప్రజలకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ బాజీ, యువజన విభాగం అధ్యక్షులు ఆవాల భవాని ప్రసాద్, నాయకులు పాటి సాంబ, డ్రిల్లింగ్ ఖాజా, పోస్టల్ రాష్ట్ర యూనియన్ నాయకులు పి వి వసంతరావు, జగ్గయ్యపేట పోస్ట్ మాస్టర్ రామచంద్ర నాయక్ పాల్గొన్నారు.

'భవిష్యత్తుకు గ్యారెంటీ' పై ప్రచారం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని 7వ వార్డు ఆర్టీసీ కాలనీలో స్థానిక తెదేపా నేతలతో కలిసి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి శ్రీరాం రాజగోపాల్ పాల్గొని మహానాడు వేదికగా విడుదల చేసిన మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మేక వెంకటేశ్వర్లు, పట్టణ తెలుగుదేశం పార్టీ సెక్రటరీ మైనేని రాధాకష్ణ, యామర్తి బోస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన ముఠా కార్మికులు



కూలి రేట్లు పెంపు కోసం విజయవాడ నగరంలో ముఠా కార్మికులు వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నారు. సిఐటియు, ఎఐటియుసి అనుబంధ ముఠా కార్మిక సంఘాలు కార్మికులకు అండగా నిలిచి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించి, ఆయా రంగాల్లోని కార్మికులకు కార్మిక సంఘాలు మద్దతుగా నిలిచాయి. కేంద్రంలోని బిజెపి-మోడీ ప్రభుత్వం 44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చటం కారణంగా వ్యాపారుల శ్రమ దోపిడీకి అడ్డా అదుపు లేకుండా పోయింది. ఫలితంగా అసంఘటితరంగ కార్మికులకు కనీస కూలిరేట్లు పెంచకుండా వారితో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారు. అసంఘటితరంగంలోని ముఠా కార్మికులు చేసే వివిధ రకాల వస్తువులు/ సరుకుల క్రయ, విక్రయాల (గూడ్స్) లోడింగ్ -అన్‌లోడింగ్ కారణంగా జిఎస్‌టి రూపంలో కేంద్ర ప్రభుత్వానికి వేల కోట్లు రాబడి వస్తున్నా... సదరు వ్యాపారులకు లాభాల రూపంలో కోట్లాది రూపాయలు పోగవుతున్నా...కార్మికుల జీవితాల్లో ఎటువంటి మార్పు కనిపించడం లేదు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేసి, పని భద్రత కల్పించి, గుర్తింపుకార్డులు, ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సదుపాయాలు, రూ.10 లక్షల ప్రమాద బీమా ఏర్పాటు, ఐదు వేలు పెన్షన్ ఇవ్వాలని అనాదిగా కార్మికవర్గం, సిఐటియు, ఎఐటియుసి లాంటి సంఘాల నుంచి డిమాండ్స్ వినిపిస్తున్నా... ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయి. ఇదే అదునుగా ఇటీవల కాలంలో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కూలి రేట్లు పెంచడానికి విముఖత చూపుతున్నారు. విజయవాడ లాంటి నగరంలో కూలిరేట్ల పెంపులో అనాధిగా వస్తున్న సాంప్రదాయాలను పాటించకుండా, నెలవారీ జీతానికి పెట్టుకుంటామని, వలస కార్మికులతో పని చేయించుకుంటామని, పని గంటలు పెంచుతామని, కార్మికుల సంఖ్యను తగ్గిస్తామని కార్మికులను వ్యాపారులు అదిరిస్తూ, బెదిరిస్తున్నా శ్రమ దోపిడీకి గురి చేస్తున్నా ...చట్టాల్లో వచ్చిన మార్పుల నేపధ్యంలో కార్మిక శాఖాధికారులు అటు కన్నెత్తి చూసే పరిస్థితి లేకుండా పోయింది. రోజుకు 14 నుంచి 16 గంటల పాటు పని చేస్తున్నా సాదర ఖర్చులన్నీపోయి, చివరకు మిగిలే డబ్బులతో కుటుంబాలు గడవటం కష్టంగా ఉందని కార్మిక వర్గం, కార్మిక సంఘాల నేతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2021లో కేజి రూ. 80 నుంచి 90 వరకు ఉన్న కంది పప్పు నేడు రూ. 160 వరకు అమాంతంగా పెరిగింది. అలాగే శనగనూనె రూ. 85 నుంచి 90 ఉంటే నేడు రూ. 175, మినపప్పు రూ. 80 నుంచి 130కు పెరిగింది. టమాట నిన్న మొన్నటి వరకు సెంచరీకి పైగా ధర పలికింది. కనీసం నగరంలో ఇంటి అద్దెలు చెల్లించలేక విజయవాడకు దూరంగా కార్మికులు నివాసముండాల్సి వస్తోంది. ఇటువంటి నేపధ్యంలో పెరిగిన ధరలకను గుణంగా ముఠా కార్మికులకు వ్యాపారులు కూలిరేట్లు పెంచాల్సి ఉంది. ప్రతి రెండు సంవత్సరాలకు తప్పని సరిగా కూలిరేట్లు పెంచే సాంప్రదాయం విజయవాడ నగరంలో అనాదిగా వస్తూనే ఉంది. కానీ వ్యాపారులు మొండికేయడంతో చేసేది లేక సిఐటియు అనుబంధ ముఠా కార్మిక సంఘం, ఇతర కార్మిక సంఘాలను కలుపుకొని గత జూన్ 28 నుంచి వివిధ రూపాల్లో ఆందోళన నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ నెల 10 నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. ముఠా కార్మిక సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కో కన్వీనర్ ఎం.సీతారాములు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు, సిఐటియు రాష్ట్ర నాయకులు చిగురుపాటి బాబూరావు, డివి కృష్ణ, నాయకులు దోనేపూడి కాశీనాథ్, బోయి సత్యబాబు, ఎం బ్రహ్మయ్య, ఎంవి సుధాకర్, కె.దుర్గారావు, ఎఐటియుసి నాయకులు ఎం.సాంబశివ రావు, ఇ.నాగేశ్వరరావు నేతృత్వంలో గత నెలన్నర రోజుల నుంచి వందలాది మంది కార్మికులను కలుపుకొని నగరంలోని ఆయా ప్రాంతాల్లో గ్రూపు మీటింగ్‌లు, కరపత్రాల పంపిణీ, సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రదర్శనలు, వ్యాపారులతో రాయ భారాలు తదితర రూపాల్లో ఆందోళనలు నిర్వహించారు. గవర్నర్‌పేట, వన్‌టౌన్‌లోని ఆయా రంగాల్లోని ముఠా కార్మికులు రూపాయికి 10 నుంచి 12 పైసల వరకు కూలి రేట్లు పెంచుకున్నట్లు కార్మిక సంఘాల నేతలు వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన రంగాల్లోని ముఠా కార్మికులకు కూడా వ్యాపారులు సాంప్రదాయ పద్ధతిలో కూలిరేట్లు పెంచాలని, లేనట్లయితే పోరుబాట తప్పదని హెచ్చరిస్తున్నారు.

- రాజు

విజయవాడ, మచిలీపట్నంలో మునిసిపల్ కార్మికుల మహా ధర్నా

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విజయవాడ, మచిలీపట్నం ధర్నా చౌక్‌లలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు మహా ధర్నాలు నిర్వహించారు. మునిసిపల్ కార్మికులకు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రమాద బీమా 20 లక్షలు చేయాలని, పనిభారం తగ్గించాలని తదితర డిమాండ్లు పరిష్కరించాలని ఎపి మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో వందలాది మంది కార్మికులతో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. అనంతరం సామూహిక రాయబారంగా వెళ్లి అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు చేసిన నినాదలతో ధర్నా చౌక్‌లు దద్దరిల్లాయి. మున్సిపల్ కార్మికులు పోరాట పటిమ కనబరిచారు. నేతల ప్రసంగాలు కార్మికవర్గాన్ని ఆలోచింప చేశాయి. న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని మునిసిపల్ కార్మికులు ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ప్రెసిడెంట్‌గా రాజు



లయన్స్ ఫైన్ ఆర్ట్స్ క్లబ్ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరిస్తున్న రాజు డేవిడ్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : లయన్స్ క్లబ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అధ్యక్షులుగా, డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్‌గా లయన్ డాక్టర్ రాజు డేవిడ్ దొంతులూరి నియమితులయ్యారు. పదిమంది ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ల సమక్షంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఎండార్సీ లయన్ పర్వతనేని సుభాష్‌బాబు, మల్టిపుల్ కౌన్సిల్ చైర్ పర్సన్ వంక రవీంద్రనాథ్, ఎల్.సి.ఐ.ఎఫ్ ఏరియా లీడర్ లయన్ డాక్టర్ అంబటి సుధాకర్ రెడ్డి చేతుల మీదుగా శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రాజు డేవిడ్‌ను అభినందిస్తూ గతంలో జిల్లా స్థాయిలో అనేకమైన పదవులు చేపట్టారని, గత 16 సంవత్సరాల నుండి లయనిజంలో సేవలందిస్తున్నారని అభినందించారు. క్లబ్ సెక్రటరీగా లయన్ ఎన్. వెంకటరత్నం, కోశాధికారిగా పి.ఇ.రాణి నియమితులయ్యారు.



మాట్లాడుతున్న డాక్టర్ పూజిత

దీర్ఘకాలంగా నీరసం నివారణపై సదస్సు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : "కొందరిలో అంతుపట్టని అలసట, నీరసం ఉంటాయని, ముఖ్యంగా యుక్త వయస్సు, మధ్య వయస్సువారిలో ఈ పరిస్థితి కనబడుతుంది. అంతుపట్టని నీరసం, అలసట మహిళల్లో మరింత ఎక్కువ" అని ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ వై.పూజిత అన్నారు. వాసవ్య నర్సింగ్ హోమ్‌లో డాక్టర్ సమరం అధ్యక్షతన శనివారం జరిగిన ఆరోగ్య సదస్సులో ఆమె "అంతులేని అలసట" అంశంపై సవివరంగా ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ సాధారణంగా కొన్ని వైరల్ జ్వరాలు వచ్చినప్పుడు, లాంగ్ కొవిడ్‌లో దీర్ఘకాలంగా నీరసం, అలసట ఉంటాయన్నారు. ఆరు నెలలకి పైగా ఎటువంటి రోగ నిర్ధారణ లేకుండా అంతుపట్టని నీరసం, ఇతర లక్షణాలు ఉన్నప్పుడు క్రానిక్ ఫెటీగ్ సిండ్రోమ్‌గా తీసుకోవాలన్నారు. ఇటువంటి పరిస్థితి ఉన్నవాళ్ళకి పౌష్టికాహారం, తేలికపాటి వ్యాయామం, విటమిన్లు, ప్రొటీన్లు ఇవ్వడం అవసరం అన్నారు. ప్రతి ఒక్కరికీ క్రానిక్ ఫెటీగ్ సింద్రోమ్ గురించి అవగాహన ఉండాలన్నారు. డా॥మారు వందన సమర్పణ చేసారు.

గద్దర్ సంస్మరణ సభ



మాట్లాడుతున్న స్వరూపరాణి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రజా యుద్ధనౌకగా పేరొందిన ప్రముఖ రచయిత కళాకారులు గుమ్మడి విఠల్ రావు(గద్దర్)సంస్మరణ సభ స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం సాయంత్రం జరిగింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి ప్రజా కళా కారులు, వాగ్గేయ కారులు, బహుజన సంఘాల ప్రతినిధులు పాల్గొని నివాళులర్పించారు. తొలుత గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించారు. బహుజన రచయితల వేదిక, అభ్యుదయ రచయితల సంఘం, దళిత మహాసభ తదితర సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆచార్యులు చల్లపల్లి స్వరూపరాణి ప్రసంగిస్తూ జీవితంలో అనేక ఆటుపోట్లను ఎదురొడ్డి నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి అణగారిన వర్గాల ఉన్నతి కోసం పాటుపడ్డారని అన్నారు. తంగిరాల సోనీ (బహుజన రచయిత వేదిక), మోతుకూరి అరుణకుమార్ (అరసం) పేరురి మురళి కుమార్ ఎస్ఎస్‌సి బోస్ (పౌరహక్కుల సంఘం) మాట్లాడుతూ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని వ్యతిరేకించిన గద్దర్ చివరి రోజుల్లో ఎన్నికలను సమర్థించారని అన్నారు. కార్యక్రమంలో మల్లెల వెంకట్రావు, పంతగాని రమేష్ (ఎబిఎస్ పార్టీ), కష్ణ (దళిత మహాసభ) కొరబండి బాబురావు, ఆర్ పిచ్చయ్య, ఆంధ్ర మాల్యాద్రి పాల్గొన్నారు.

భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణ



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న కాంతి రాణా టాటా

ప్రజాశక్తి-విజయవాడ : ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే స్వాతంత్ర వేడుకల భద్రత ఏర్పాట్లను నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా , ఇతర పోలీసు అధికారులతో కలిసి ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియంలో భద్రతా ఏర్పాట్లను మరోసారి పర్యవేక్షించి అధికారులకు తగు సూచనలు సలహాలను అందించారుఈ సందర్భంగా నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా మాట్లాడుతూ... స్వాతంత్ర వేడుకలలో పాల్గొనడానికి వి.వి.ఐ.పి.లు/ వి.ఐ.పి.లు, ప్రజలు ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియానికి వస్తున్నందున స్టేడియం లో ఎటువంటి ఇబ్బంది ఎదురుకాకుండా కట్టు దిట్ట మైన భద్రత, పటిష్ట బందోబస్తు ఏర్పాటు, స్టేడి యం పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి. విశాల్ గున్ని, సీనియర్ ఎస్.పి. రవీంద్రబాబు, ఏం.ఎల్.సి. సిఎం ప్రో గ్రాం కో ఆర్డి నేటర్ తలశిల రఘురాం, ఏడిసిపిలు, ఏసిపిలు, జిల్లా అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐటిఎం ఆమోదంతో నూతన కోర్సులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : హెచ్‌సిఎల్ గ్రూపు యొక్క ఆన్‌లైన్ లెర్నింగ్ ఫ్లాట్‌ఫారమ్ గీక్ నెట్‌వర్క్ సంస్థతో కలసి సివిల్, మెకానికల్ ఇంజనీర్ల కోసం ప్రత్యేకంగా రెండు కంప్యూటర్ డిజైన్ కోర్సులను పరిచయం చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధి ఎం.కె.ఎస్.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈకోర్సులు ఐటీఎం ప్రవర్తక్, ఆటో డెస్క్‌లచే ఆమోదించబడ్డాయని తెలిపారు. అలాగే పైథాన్ నైపుణ్యాలను ఉపయోగించి రూపొందించిన అత్యాధ/నిక క్యాడ్ ఆటోమేషన్ కోర్సులో కూడా విద్యార్థులు ఉన్నత రంగానికి వెళ్లేందుకు సహకరిస్తుందని తెలిపారు. వినూత్న విధానమైన భాషా సమ్మేళనం, కోర్సులో ఉన్న ప్రత్యేకత అన్నారు.

జీ తెలుగులో - 14 నుండి నిండు నూరేళ్ల సావాసం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : సరికొత్తగా వినోద కార్యక్రమాలను అందిస్తున్న జీ తెలుగు ఈనెల 14వ తేదీ నుండది నిండు నూరేళ్ల సావాసం కొత్త కార్యక్రమాన్ని అందిస్తున్నామని జీ తెలుగు రీజనల్ ప్రతినిధి కె.ఎస్.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని ఛానల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 14వ తేదీ నుండి సోమవారం నుండి శనివారం వరకు ప్రతిరోజూ రాత్రి 7 గంటలకు కార్యక్రమనం ప్రసారమ వుతుందని తెలిపారు. ప్రతిరోజూ వినోద, విజ్ఞాన కార్యక్రమాలను అందిస్తున్నామని తెలియ చేశారు. ప్రేక్షకుల వద్ద నుండి మంచి స్పందన లభిస్తుందని రానున్న కాలంలో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించను న్నట్లు తెలిపారు.

15న 'జయహో భారత్' ఆర్ట్ కాంటెస్ట్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : కళలను, కళా సంస్కృతిని కాపాడు కోవడంతో పాటు నేటితరం చిన్నారుల్లో దేశభక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ నెల 15వ తేదీ జయహో భారత్... ప్రౌడ్ టుబి యాన్ ఇండియన్ పేరుతో ఆర్ట్ కాంటెస్ట్ నిర్వహిస్తున్నామని టాట్మోర్ టెర్నింగ్ ప్రయివేట్ లిమిటెడ్ సిఇఒ పద్మలత చెప్పారు. నగరంలోని ఆ సంస్థ కార్యాలయంలో శనివారం ఆర్ట్ కాంటెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. పద్మలత మాట్లాడుతూ ఫోరం ఫర్ ఆర్టిస్ట్, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం, తమ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. ఫోరం ఫర్ ఆర్టిస్ట్ కన్వీనర్ ఏ.సునీల్ కుమర్ మాట్లాడుతూ 15 తేదీ మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు ఈ పోటీలు బందరురోడ్డులోని మాకినేని బసవ పున్నయ్యవిజ్ఞాన కేంద్రం ఆవరణలో జరుగుతాయని చెప్పారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు కలెక్టర్ డిల్లీరావు చేతుల మీదుగా విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని అన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 14 తేదీ సాయంత్రం లోగా ఫోరమ్ ఫర్ ఆర్టిస్ట్ విజేఎంజీమెయిల్.కామ్) వెబ్‌సైట్‌లో వివరాలు నవేదు చేసుకోవాలన్నారు. 15 తేది ఆర్ట్ కాంటెస్ట్ జరిగే ఆవరణలో కూడా పేర్లు నమోదు చేసుకుంటామని చెప్పారు. ఇతర వివరాలకు 77993 08775,79814 35393,88011 04107 నెంబర్లల్లో సంప్రదించాల్సిం దిగా ఆయన కోరారు. ఎంబివికె ప్రతినిధి నారాయణరావు మాట్లాడుతూ ప్రముఖ చిత్రకారులు యడవల్లి రామకృష్ణా, కె.నారాయణరావు, పంతంగి శ్రీనివాస్‌లను సత్కారంతో పాటు భారతీయ భారతి ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. ఈవెంట్ ఆర్గనైజర్లు గిరిధర్ అరసవల్లి, స్ఫూర్తి శ్రీనివాస్, కళాసాగర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.